


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA

RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 22.06.2026 | సంపుటి: 3 | సంచిక: 140 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 22.06.2026 | VOLUME : 3 | ISSUE : 140 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575





2

## కేబీఆర్ పార్క్ పరిసరాల్లో వన్‌వే ట్రాఫిక్ ట్రయల్ రన్

- ట్రాఫిక్ రద్దీ తగ్గింపే లక్ష్యం
- ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించాలని సూచన



3

## కేంద్రంపై ఉమ్మడి పోరుకు సిద్ధం

- విపక్ష రాష్ట్రాలతో కలిసి కార్యాచరణకు తెలంగాణ కసరత్తు
- వీబీజీ రామ్‌జీ చట్టాన్ని సవాల్ చేయాలని నిర్ణయం
- రాష్ట్రాలపై అదనపు భారం మోపడం సరికాదన్న కేబినెట్ సబ్ కమిటీ

# కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ ఫలిస్తుందా?

**ఇండీ కూటమిలో విభేదాలు**

**కాంగ్రెస్‌ను వీడుతున్న ప్రాంతీయ పార్టీలు**

**గులాబీ బాస్‌తో జత కడతారా?**



**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** జాతీయ రాజకీయాల్లో వేగంగా మారుతున్న పరిణామాలు మరోసారి థర్డ్ ఫ్రంట్ చర్చకు ఊతమిస్తున్నాయి. ఇండీ కూటమిలో పెరుగుతున్న విభేదాలు, కాంగ్రెస్‌తో ప్రాంతీయ పార్టీలకు ఏర్పడుతున్న రాజకీయ అసౌకర్యం, రాష్ట్రాల

మిగతా 2వ పేజీలో..



### కూల్చివేతలు పేదల ఇళ్లపైనేనా..


## పెద్దల ఇళ్లకు వెళ్లవా?

- హనుమాన్ నగర్ వాసులకు కేటీఆర్ భరోసా
- ఏళ్లుగా ఉంటున్న వారిని ఖాళీ చేయించడం సరికాదు
- ప్రభుత్వం ఇళ్లు కట్టించాలి.. కూల్చకూడదు
- ప్రజల తరఫున న్యాయ పోరాటం చేస్తామని హామీ

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** హైడ్రా, బుల్డోజర్లు పేదల ఇళ్లపైనే ప్రయోగిస్తారా? పెద్దల నిర్మాణాల జోలికి వెళ్లరా? అని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం బదంగ్‌పేట్ పరిధిలోని హనుమాన్ నగర్‌లో నివాసాలు ఖాళీ చేయాలని అధికారులు సూచించడంతో అక్కడి ప్రజలను కలిసి ఆయన భరోసా కల్పించారు.

దాదాపు 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న హనుమాన్ నగర్‌లోని 350కి పైగా కుటుంబాలను ఖాళీ చేయించడం సరికాదని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి ఉండాలి తప్ప, ఉన్న ఇళ్లను కూల్చడానికి

మిగతా 2వ పేజీలో..



## నీట్ 2026 రీఎగ్జామ్ పేపర్ కఠినం..

- కటాఫ్ భారీగా తగ్గే అవకాశం.. ఫిజిక్స్, కెమిస్ట్రీలో పెరిగిన క్లిష్టత
- జేఈఈ స్థాయి ప్రశ్నలతో విద్యార్థులకు సవాల్
- బయాలజీలో కాస్త ఊరట
- మార్కులు తగ్గినా ర్యాంకులపై ప్రభావం ఉండదన్న నిపుణులు

3

### స్కోచ్ అవార్డు సాధించిన

## టి-ఫైబర్

- డిజిటల్ పరివర్తనకు జాతీయ స్థాయిలో గుర్తింపు
- గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు
- ప్రతి ఇంటికీ డిజిటల్ సేవలే లక్ష్యం: శ్రీధర్ బాబు



2

### విద్యాశాఖ అధికారుల

## జర్మనీ పర్యటనపై వివాదం

- సాంకేతిక విద్య అధ్యయనానికి 35 మంది బృందం
- ఎంపికలో నిబంధనలు పాటించలేదని ఆరోపణలు
- అర్హత లేని వారిని చేర్చారంటూ శాఖలో చర్చ
- టెక్నికల్ విద్యాభివృద్ధి లక్ష్యంపై అనుమానాలు

2






## ఇళ్ల స్థలాల కోసం వామపక్షాల ఉద్యమ బాట

- ఈ నెల 27న హనుమకొండలో 10 వేల మందితో భారీ ప్రదర్శన
- జూలై 1న కలెక్టరేట్ల ముట్టడి.. జూలై 6న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

**హైదరాబాద్, జూన్ 21:** రాష్ట్రంలోని నిరుపేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు సాధించేందుకు వామపక్ష పార్టీలు మరో భారీ ఉద్యమానికి సిద్ధమవుతున్నాయి. విద్యుత్ ఉద్యమం తరహాలో రాష్ట్రవ్యాప్తంగా పోరాట కార్యక్రమాలు చేపట్టనున్నట్లు

మిగతా 3వ పేజీలో..

## బొగ్గు మాయం ఆరోపణల్లో నిజం లేదు: సింగరేణి

- రూ.1600 కోట్ల కుంభకోణం ప్రచారాన్ని ఖండించిన యాజమాన్యం
- డిజిటల్ వ్యవస్థలతో ప్రతి టన్ను బొగ్గుపై నిఘా
- జీపీఎస్, జియో ఫెన్సింగ్‌తో రవాణా పర్యవేక్షణ



3

## సైబర్ బాధితులకు భారీ ఊరట.. రూ.45.21 కోట్లు తిరిగి అందజేత

- జాతీయ లోక్ అదాలత్‌లో 6,303 మందికి న్యాయం
- సైబరాబాద్ పరిధిలో అత్యధికంగా రూ.21.91 కోట్ల రికవరీ
- సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి



2




2

## బీజేపీ కుట్రతోనే నామినేషన్ తిరస్కరణ: మీనాక్షి నటరాజన్



## డెకరేషన్ గోదాంలో కెమికల్ బాక్స్ పేలి కార్మికుడి మృతి

- బదంగ్‌పేట్‌లో ఘటన
- పేలుడు ధాటికి శరీర భాగాలు చెల్లాచెదురు
- మృతుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనూప్ ప్రధాన్
- కెమికల్స్ నిల్వపై పోలీసుల దర్యాప్తు

**హైదరాబాద్,రాజముద్ర న్యూస్:** హైదరాబాద్ శివార్లలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. బదంగ్‌పేట్‌లోని

మిగతా 3వ పేజీలో..



2

## రాహుల్‌తో భేటీ ఏర్పాటు చేయాలి: రామచందర్‌రావు

- కాంగ్రెస్ గ్యారంటీల అమలుపై ప్రజల గోడు వినిపిస్తామన్న బీజేపీ

## జయశంకర్ ఆశయాలకు భిన్నంగా రాష్ట్ర పాలన: కేటీఆర్

- **కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో అసంతృప్తి**
- **భూ వ్యవహారాల్లో అవినీతి పెరిగిందంటూ ఆరోపణలు**
- **అధికారంలోకి వస్తే అక్రమాలపై చర్యలు తీసుకుంటాం**

**హైదరాబాద్, జూన్ 21:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించిన అనంతరం రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై స్పందించారు. తెలంగాణ కోసం జయశంకర్ ఎన్నో ఆశయాలు, లక్ష్యాలతో పోరాటం చేశారని, అయితే ప్రస్తుతం రాష్ట్రంలో సాగుతున్న పాలన ఆ ఆశయాలకు భిన్నంగా ఉందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేయడం లేదని, పాలనపై అన్ని వర్గాల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు.

ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు మేలు చేసేలా లేకపోవడంతో నిరాశ నెలకొందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం వెనుకబడిందని, దీంతో ప్రజల్లో నమ్మకం తగ్గుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో భూ వ్యవహారాలకు సంబంధించిన ఫిర్యాదులు పెరుగుతున్నాయని కేటీఆర్ తెలిపారు. భూముల విషయంలో అవకతవకలు, అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, భూ యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం సమగ్రంగా స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలకు బాధ్యులైన వారిని వదిలిపెట్టబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

## కూల్చివేతలు పేదల ఇళ్లపైనేనా.. పెద్దల ఇళ్లకు వెళ్లవా?

**మొదటిపేజీ తరువాయి**

కాదని పేర్కొన్నారు.

హనుమాన్ నగర్‌లోని పేదల ఇళ్లపైకి వచ్చే హైడ్రా, బుల్డోజర్లు దుర్గం చెరువు పరిధిలో నిర్మాణాలు చేసిన వారి ఇళ్లకు ఎందుకు వెళ్లవని ప్రశ్నించారు. జలాశయాలు, చెరువుల పరిధిలో నిర్మాణాలు ఉన్న పెద్దలపై కూడా అదే నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రజలు ఐక్యంగా ఉండాలి**

హనుమాన్ నగర్ ప్రజలు ఐక్యంగా ఉండి తమ ఇళ్లను కాపాడుకోవాలని కేటీఆర్ సూచించారు. వారి వెంట కార్తీక్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పార్టీ నేతలు ఉంటారని తెలిపారు.

రాబోయే ఎన్నికల తర్వాత ప్రజలు కోరుకుంటున్న ప్రభుత్వం వస్తుందని, ఆ తర్వాత సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎవరూ ఆందోళన చెందకుండా న్యాయం కోసం పోరాడాలని కోరారు.

**బీఆర్ఎస్ హయాంలో ఇబ్బంది పెట్టలేదు**

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లలో హనుమాన్ నగర్ ప్రజలను ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత కలిగి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చెప్పిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, పాలన అంటే ప్రజల ఇళ్లు కూల్చడం కాదని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.

**న్యాయ పోరాటానికి అండగా ఉంటాం**

ప్రభుత్వం నుంచి నోటీసులు వస్తే ప్రజల తరఫున న్యాయవాదులను ఏర్పాటు చేసి పోరాటం చేస్తామని కేటీఆర్ తెలిపారు. ఎలాంటి బెదిరింపులకు భయపడవద్దని, న్యాయం కోసం నిలబడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి కార్తీక్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ అధికారుల జర్మనీ పర్యటనపై వివాదం

**హైదరాబాద్, జూన్ 21:**

ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో అంతర్జాతీయ బోధనా విధానాలను పరిశీలించేందుకు రాష్ట్ర విద్యాశాఖ అధికారుల బృందం జర్మనీ పర్యటనకు వెళ్లనుంది. ఈ నెల 28న 35 మంది సభ్యులతో కూడిన బృందం బయలుదేరనుండగా, సాంకేతిక విద్యాశాఖ నుంచి ఏడుగురు సభ్యులను ఎంపిక చేశారు. అయితే ఈ ఎంపికపై శాఖలోనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జర్మనీలో సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు, పరిశ్రమలకు అనుగుణంగా విద్యా విధానాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేయడమే ఈ పర్యటన ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. టెక్నాలజీ, ఆటోమొబైల్, మెకానికల్, ఐటీ రంగాల్లో అక్కడి విధానాలను పరిశీలించి, రాష్ట్ర సాంకేతిక విద్యలో అమలు చేసే అంశాలపై అధ్యయనం చేయనున్నారు.

విద్యా విధానాలపై అధ్యయనం ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధికారులను విదేశాలకు పంపించి అక్కడి విద్యా విధానాలను అధ్యయనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించే విధానాలకు పేరున్న ఫిన్లాండ్‌తో పాటు అమెరికా, యూకే, సింగపూర్, జర్మనీ వంటి దేశాల్లోని విద్యా విధానాలను పరిశీలించేందుకు ప్రణాళిక రూపొందించింది. ఈ పర్యటనలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఏ. దేవసేన కూడా పాల్గొంటున్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సాంకేతిక విద్యలో మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా బృందం పనిచేయనుంది.




అయితే సాంకేతిక విద్యాశాఖ నుంచి ఎంపిక చేసిన ఏడుగురిలో ముగ్గురు సభ్యుల ఎంపికపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత రంగాల్లో అనుభవం, అర్హత లేని వారిని ఎంపిక చేశారనే ఆరోపణలు వస్తున్నాయి.

**ఎంపికపై శాఖలో చర్చ**

ఎంపికైన వారిలో రిటైర్డ్ ఇంగ్లీష్ లెక్చరర్‌తో పాటు ఫిజిక్స్, సివిల్, డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారులు ఉన్నారని, జర్మనీ పర్యటనలో సాంకేతిక విద్యకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు సంబంధిత నిపుణులకు అవకాశం ఇవ్వాల్సిందని కొందరు అధికారులు అభిప్రాయపడుతున్నారు. అర్హులైన సబ్జెక్టు నిపుణులను పక్కన పెట్టి ఇతరులను ఎంపిక చేయడంపై ఉద్యోగ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గతంలో ఫిన్లాండ్ పర్యటనకు వెళ్లిన వారిలోనూ అర్హతలపై ప్రశ్నలు వచ్చినట్లు, అక్కడ అధ్యయనం చేసిన అంశాలపై ఇప్పటివరకు విస్తృత చర్చ జరగలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ పర్యటన కోసం ఎస్సీబీటెట్ నిధులు వినియోగిస్తున్న నేపథ్యంలో ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

# రాహుల్‌తో భేటీ ఏర్పాటు చేయాలి

- **సీఎం రేవంత్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి బహిరంగ లేఖ**

**హైదరాబాద్, జూన్ 21:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలులో విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.

రాష్ట్రంలో అమలు కాని గ్యారంటీలపై నిలదీసేందుకు, ప్రజల సమస్యలను నేరుగా వినిపించేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సమావేశం ఏర్పాటు చేయాలని లేఖలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకత్వం ఈ భేటీని ఏర్పాటు చేయడంలో విఫలమైతే, తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల విషయంలో ఆ పార్టీ చేసిన ద్రోహంగా భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు.

2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీలు తెలంగాణలో పర్యటించి ప్రజలకు పలు హామీలు ఇచ్చారని రామచందర్‌రావు గుర్తు చేశారు. ఆ హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారని, అయితే మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత, వృద్ధులు, పేద కుటుంబాలు ఇప్పటికీ పథకాల అమలు కోసం ఎదురుచూస్తున్నాయని విమర్శించారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, నెరవేరని హామీల అంశాలను రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, దీనిపై ముఖ్యమంత్రి స్పందించి సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

**లేఖల యుద్ధంగా మారిన బొగ్గు, మెట్రో అంశాలు**

ఇదిలా ఉండగా సింగరేణి బొగ్గు వ్యవహారం, హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మధ్య లేఖల పరంపర కొనసాగుతోంది.

సింగరేణికి రావాల్సిన నిధులు, బొగ్గు బ్లాకుల కేటాయింపుల అంశంపై కేంద్రానికి ముఖ్యమంత్రి లేఖ రాశారు. అలాగే హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి నిధులు, అనుమతులు వేగంగా మంజూరు చేయాలని కోరారు.

దీనికి ప్రతిస్పందనగా కిషన్‌రెడ్డి రాష్ట్రంలో బొగ్గు వ్యవహారంపై వస్తున్న ఆరోపణలపై విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రికి లేఖ రాశారు. బొగ్గు కేటాయింపుల్లో కేంద్రం పారదర్శకంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. మెట్రో రెండో దశ ప్రాజెక్టు ఆలస్యానికి రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన ప్రాజెక్టు నివేదికలు, ఆర్థిక భాగస్వామ్య వివరాలను సకాలంలో సమర్పించకపోవడమే కారణమని పేర్కొన్నారు. కేంద్రంపై ఆరోపణలు చేయడం కంటే రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు.

## స్కోచ్ అవార్డు సాధించిన టి-ఫైబర్

**హైదరాబాద్, జూన్ 21:**

గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సమానత్వం సాధనకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందిస్తూ, ఈపాలన సేవలకు బలమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ (టిఫైబర్) ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు 2026ను అందుకుంది. న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో టిఫైబర్ ప్రతినిధులు ఈ అవార్డును స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, టిఫైబర్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చేపడుతున్న కార్యక్రమాలపై మంత్రికి వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహించడం, కృత్రిమ మేధ ఆధారిత అభ్యాస అవకాశాలను విస్తరించడం, రైతు వేదికలకు అంతర్జాల సదుపాయాలు కల్పించడం వంటి కార్యక్రమాల్లో టిఫైబర్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

టిఫైబర్‌కు స్కోచ్ అవార్డు రావడం పట్ల మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ అభివృద్ధి కార్యక్రమాలకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి కుటుంబానికి అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గృహాలకు టిఫైబర్ సేవలను మరింత విస్తరించే దిశగా చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గించడంలో టిఫైబర్ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు.



## కేబీఆర్ పార్క్ పరిసరాల్లో వన్‌వే ట్రాఫిక్ ట్రయల్ రన్

**హైదరాబాద్, జూన్ 21:**

నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అధికారులు కీలక చర్యలు చేపట్టారు. హెచ్‌సిటీ ప్రాజెక్టు పనుల నేపథ్యంలో కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం వన్‌వే ట్రాఫిక్ ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ట్రయల్ రన్ అమల్లో ఉండనుంది.

కేబీఆర్ పార్క్ మీదుగా స్టడీ సర్కిల్, బసవతారకం ఆస్పత్రి, బీఆర్ఎస్ కార్యాలయం, ఒమేగా ఆస్పత్రి మార్గం నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు వెళ్లే వాహనాలకు వన్‌వే విధానం అమలు చేస్తున్నారు. ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎన్ఎఫ్‌సీఎల్ నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36, 45 వైపు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఎన్టీఆర్ భవన్-బసవతారకం ఆస్పత్రి-విద్యాభవన్ మార్గాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. యూసుఫ్‌గూడ, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల నుంచి జూబ్లీహిల్స్ వైపు వెళ్లే వాహనాలకు కూడా ప్రత్యేక మళ్లింపులు అమలు చేస్తున్నారు. ఐటీసీ కోహినూర్, కేబుల్ బ్రిడ్జ్ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు రోడ్ నంబర్ 60, 67 మార్గాల ద్వారా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్‌కు చేరుకోవాలని అధికారులు సూచించారు. ట్రయల్ రన్ సమయంలో ఎక్కడా యూటర్న్‌లకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా ఎడమ వైపు లేన్‌లోనే ప్రయాణించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని కోరారు. రియల్‌టైమ్ ట్రాఫిక్ పరిస్థితులను తెలుసుకునేందుకు నావిగేషన్ యాప్‌లను వినియోగించాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు వీలైనంత వరకు కార్ పూలింగ్, ప్రజా రవాణా సేవలను ఉపయోగించాలని ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## సైబర్ బాధితులకు భారీ ఊరట.. రూ.45.21 కోట్లు తిరిగి అందజేత

**హైదరాబాద్, జూన్ 21:**

సైబర్ నేరాల బారినపడి డబ్బులు కోల్పోయిన బాధితులకు తెలంగాణ పోలీస్ శాఖ భారీ ఊరటనిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 6,303 మంది బాధితులకు రూ.45.21 కోట్లు తిరిగి అందజేసింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, రాష్ట్ర న్యాయ సేవా సంస్థ, బ్యాంకులు, డిజిటల్ చెల్లింపుల సంస్థలు, పోలీసు శాఖల సమన్వయంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ మోసాలకు గురైన బాధితులకు వేగంగా న్యాయం అందించడంతో పాటు రికవరీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. యూపీఐ మోసాలు, పెట్టుబడి పేరుతో జరిగే మోసాలు, అధికారులమంటూ బెదిరించి డబ్బులు కాజేసే ఘటనల్లో నష్టపోయిన బాధితులను గుర్తించి, బ్యాంకులు, దర్యాప్తు సంస్థల సహకారంతో నగదు రికవరీ ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ లోక్ అదాలత్‌లో అత్యధికంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2,232 మంది బాధితులకు రూ.21.91 కోట్లు తిరిగి అందజేశారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నేరుగా 77 మందికి రూ.6.83 కోట్లు, మల్కాజిగిరి పరిధిలో 779 మందికి రూ.4.04 కోట్లు, హైదరాబాద్ పరిధిలో 755 మందికి రూ.3.22 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 167 మందికి రూ.1.69 కోట్లు తిరిగి అందించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు వివిధ లోక్ అదాలత్‌ల ద్వారా 59,953 మంది సైబర్ నేర బాధితులకు మొత్తం రూ.445.41 కోట్లు తిరిగి అందించడం విశేషమని అధికారులు తెలిపారు. 2023లో రూ.8.36 కోట్లు, 2024లో రూ.183.9 కోట్లు, 2025లో రూ.182.95 కోట్లు, 2026లో ఇప్పటివరకు రూ.70.07 కోట్లు రికవరీ చేసినట్లు వెల్లడించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శిఖా గోయల్ సూచించారు. అపరిచితులకు ఓటీపీలు, పిన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలు ఇవ్వొద్దని హెచ్చరించారు. అనుమానాస్పద సందేశాలు, లింక్‌లపై స్పందించవద్దని సూచించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా తొలి గంటలోనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని లేదా కేంద్ర సైబర్ ఫిర్యాదుల పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయని స్పష్టం చేశారు.

## బీజేపీ కుట్రతోనే నామినేషన్ తిరస్కరణ: మీనాక్షి నటరాజన్

హైదరాబాద్, జూన్ 21:

రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ స్పందించారు. ఈ అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తన నామినేషన్ తిరస్కరణకు కారణంగా పేర్కొంటున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. తనపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, ఒక ప్రైవేట్ పిటిషన్‌కు సంబంధించిన న్యాయ నోటీసు మాత్రమే వచ్చిందని చెప్పారు. ఫార్మ్26లో అలాంటి న్యాయ నోటీసులను తప్పనిసరిగా వెల్లడించాల్సిన నిబంధన లేదని వివరించారు. ప్రైవేట్ పిటిషన్ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఆ ఘటన జరిగిన సమయంలో తాను కాంగ్రెస్ ఇంచార్జిగా కూడా లేనని పేర్కొన్నారు. నాంపల్లి కోర్టు కూడా ఆ కేసు తన పరిధిలోకి రాదని స్పష్టం చేసినట్లు చెప్పారు. పిటిషన్ దాఖలు చేసిన మహిళకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచిందని, ఫిర్యాదులో ఉన్న వ్యక్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు టికెట్ కూడా నిరాకరించామని వెల్లడించారు. తన నామినేషన్ తిరస్కరణపై నిరాశ చెందలేదని, ఇప్పటికే ఎన్నికల పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. న్యాయస్థానంలో తమ వాదనలు వినిపించి న్యాయం సాధిస్తామని చెప్పారు. తెలంగాణ నుంచి ఎవరినైనా పక్కనబెట్టి తనను రాజ్యసభకు పంపించే ప్రయత్నం జరుగుతోందన్న ప్రచారాన్ని ఆమె ఖండించారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రతి నాయకుడు తమకు ముఖ్యమేనని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో తనపై పార్టీలోనే కుట్ర జరిగిందన్న ఆరోపణలను కూడా




కొట్టిపారేశారు. సంఖ్యాబలం లేకపోయినా బీజేపీ మూడో అభ్యర్థిని బరిలోకి దింపిందని, మొత్తం వ్యవహారంలో బీజేపీ పాత్రపై అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. జార్ఖండ్‌లో కూడా ఇదే తరహాలో బీజేపీ పోటీకి దిగిందని గుర్తు చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా సంఖ్యాబలం ఉందని, బీజేపీకి మూడో సీటు గెలుచుకునేంత మంది ఎమ్మెల్యేల మద్దతు లేదని ఆమె పేర్కొన్నారు.

# కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ ఫలిస్తుందా?

**మొదటిపేజీ తరువాయి**

వారీగా మారుతున్న సమీకరణాలు కొత్త ప్రత్యామ్నాయ రాజకీయ వేదికకు అవకాశం కల్పిస్తున్నాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒకప్పుడు ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదనతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేరు మరోసారి రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

**ఇండీ కూటమిలో అసంతృప్తి**

బీజేపీని ఎదుర్కోవాలనే లక్ష్యంతో ఏర్పడిన ఇండీ కూటమిలో భాగస్వామ్య పార్టీల మధ్య మొదటి నుంచే భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. రాష్ట్రాల వారీగా స్థానిక రాజకీయ ప్రయోజనాలు, సీట్ల పంపకాలు, నాయకత్వ అంశాల్లో విభేదాలు తరచూ బయటపడుతున్నాయి. అనేక ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్ ఆధిపత్యంపై అసంతృప్తిగా ఉన్నాయనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

**ప్రాంతీయ పార్టీలకు కాంగ్రెస్ భారమా?**

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పూర్వ వైభవాన్ని తిరిగి సాధించలేకపోతున్న తరుణంలో ప్రాంతీయ పార్టీలు తమ రాజకీయ భవిష్యత్తుపై కొత్త లెక్కలు వేసుకుంటున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో పొత్తు కంటే స్వతంత్ర రాజకీయమే లాభదాయకమనే అభిప్రాయాలు బలపడుతున్నాయి. రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో నేరుగా పోటీ పడుతున్న పార్టీలకు జాతీయ స్థాయిలో అదే పార్టీతో కలిసి నడవడం కూడా ఇబ్బందికరంగా మారుతోంది.

**కేసీఆర్ వైపు చూపు?**

ఇలాంటి పరిస్థితుల్లో ప్రాంతీయ పార్టీలకు ప్రత్యామ్నాయ వేదికగా కేసీఆర్ పేరు మళ్లీ చర్చకు వస్తోంది. తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతంగా నడిపించిన నాయకుడిగా, ప్రాంతీయ హక్కుల అంశాన్ని జాతీయ స్థాయిలో ప్రస్తావించిన నేతగా కేసీఆర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. గతంలో ఫెడరల్ ఫ్రంట్ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోయినా, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు మళ్లీ అలాంటి అవకాశాలను తెరపైకి తీసుకొస్తున్నాయి.

**బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం సాధ్యమేనా?**

ప్రస్తుతం జాతీయ రాజకీయాలు ఎన్డీయే, ఇండీ కూటముల చుట్టూ తిరుగుతున్నాయి. అయితే ఈ రెండు కూటములతో అసంతృప్తిగా ఉన్న ప్రాంతీయ పార్టీల సంఖ్య కూడా తక్కువేమీ కాదు. తమ రాష్ట్ర ప్రయోజనాలు, రాజకీయ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలనుకునే పార్టీలు కొత్త వేదిక కోసం ఎదురుచూస్తున్నాయనే అభిప్రాయం ఉంది. అలాంటి శక్తులను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం జరిగితే థర్డ్ ఫ్రంట్‌కు అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.

**ప్రధాన సవాళ్లు కూడా ఉన్నాయి**

అయితే థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రధానమంత్రి అభ్యర్థి అంశం, ఉమ్మడి కార్యాచరణ, రాష్ట్రాల వారీ రాజకీయ విభేదాలు వంటి అంశాలు అడ్డంకులుగా మారవచ్చు. గతంలో ఏర్పడిన అనేక ప్రత్యామ్నాయ కూటములు ఎన్నికల ముందు లేదా తర్వాత విచ్ఛిన్నమైన ఉదాహరణలు ఉన్నాయి.

**మారుతున్న రాజకీయ సమీకరణాలు**

ఇండీ కూటమిలో విభేదాలు మరింత పెరిగితే, కాంగ్రెస్ నుంచి ప్రాంతీయ పార్టీలు దూరమైతే జాతీయ రాజకీయాల్లో కొత్త కూటముల ఏర్పాటుకు అవకాశాలు పెరగవచ్చు. అలాంటి పరిస్థితుల్లో ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే నాయకుడిగా కేసీఆర్ మళ్లీ ముందుకు వస్తారా? లేక ప్రస్తుత కూటములే కొనసాగుతాయా? అనే ప్రశ్నలకు రానున్న నెలల్లో జరిగే రాజకీయ పరిణామాలే సమాధానం చెప్పనున్నాయి.

# నీట్ 2026 రీ-ఎగ్జామ్ పేపర్ కఠినం..

**హైదరాబాద్, జూన్ 21:**

నీట్ 2026 రీఎగ్జామినేషన్ పూర్తయింది. ఈసారి ప్రశ్నపత్రం క్లిష్టంగా వచ్చిందని విద్యార్థులు, సబ్జెక్టు నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల్లో సమస్య ఆధారిత ప్రశ్నలు ఎక్కువగా రావడంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. పేపర్ కఠినత పెరగడంతో ఈసారి కటాఫ్ మార్కులు గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

విశ్లేషకుల ప్రకారం రీఎగ్జామ్‌లో కఠిన స్థాయి ప్రశ్నలు ఎక్కువగా కనిపించాయి. అత్యంత క్లిష్టమైన స్థాయికి చెందిన ప్రశ్నలు దాదాపు 16 వరకు ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. సులభమైన స్థాయి ప్రశ్నలు చాలా తక్కువగా ఉండటం పేపర్ కష్టతను సూచిస్తోందని వివరించారు.

ఫిజిక్స్ విభాగం విద్యార్థులను ఎక్కువగా ఇబ్బందులకు గురిచేసింది. గత పరీక్షలతో పోలిస్తే ఈసారి ప్రశ్నలు లోతైన అవగాహన, సమస్య పరిష్కార సామర్థ్యాన్ని పరీక్షించేలా వచ్చాయని విద్యార్థులు తెలిపారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్డ్ స్థాయి ప్రశ్నల తరహాలో కొన్ని ప్రశ్నలు ఉండటంతో సమాధానాలు గుర్తించడానికి ఎక్కువ సమయం పట్టిందని చెప్పారు.

కెమిస్ట్రీలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. సూత్రాలను నేరుగా అడగకుండా విశ్లేషణ ఆధారిత ప్రశ్నలు రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రశ్నలు మధ్యస్థ స్థాయిలో ఉన్నప్పటికీ, మొత్తం మీద విభాగం కఠినంగానే ఉందని నిపుణులు పేర్కొన్నారు.

బయాలజీ మాత్రం కొంత ఊరటనిచ్చిందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. బాటనీ, జువాలజీ విభాగాల్లో ప్రశ్నలు విద్యార్థులకు అనుకూలంగా ఉన్నాయని చెబుతున్నారు. సమయాన్ని సరిగ్గా వినియోగించుకుని బయాలజీలో మెరుగైన మార్కులు సాధించిన వారికి మంచి ర్యాంకులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

**కటాఫ్ మార్కులు తగ్గే అవకాశం**

ఫిజిక్స్, కెమిస్ట్రీ కఠినత కారణంగా ఈసారి అత్యధిక మార్కులు సాధించడం అంత సులభం కాదని నిపుణులు అంచనా వేస్తున్నారు. గతంలో పూర్తి మార్కులు సాధించిన రికార్డులు ఉన్నప్పటికీ, ఈసారి అలాంటి ఫలితాలు తగ్గే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

పేపర్ కఠినంగా ఉన్నప్పుడు దాని ప్రభావం అన్ని విద్యార్థులపైనా ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అందువల్ల మార్కులు తగ్గినా ర్యాంకుల్లో పెద్ద మార్పు ఉండకపోవచ్చని పేర్కొన్నారు. గత ఏడాది కటాఫ్‌తో పోలిస్తే ఈసారి నీట్ 2026 రీఎగ్జామ్‌లో కటాఫ్ గణనీయంగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో 450 మార్కుల వరకు అవసరమయ్యే చోట, ఈసారి 420 మార్కులు వచ్చినా మెడికల్ సీటు అవకాశాలు ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**విద్యార్థులపై ఒత్తిడి వద్దు**

పరీక్ష కఠినంగా వచ్చిందనే కారణంతో విద్యార్థులు నిరాశ చెందవద్దని నిపుణులు సూచిస్తున్నారు. రద్దైన పరీక్షలో బాగా రాసి, రీఎగ్జామ్‌లో ఆశించిన స్థాయిలో రాయలేకపోయామని భావించి తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తీసుకురావద్దని మెడికో పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లోజు సత్యనారాయణ తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లోనూ కొన్ని సమస్యలు ఎదురయ్యాయి. థంబ్ ఇంప్రెషన్, ఐరిష్ స్కానింగ్, ఫొటోలు, సంతకాల ప్రక్రియలో ఆలస్యం కావడంతో కొందరు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత కూడా కొన్ని కేంద్రాల్లో అదనపు ప్రక్రియలు చేపట్టడంతో సమయం వృథా అయిందని విద్యార్థులు తెలిపారు.

అయితే ఈసారి విద్యుత్ అంతరాయం సమస్యలు రాకుండా పరీక్షా కేంద్రాల్లో జనరేటర్లను ఏర్పాటు చేశారు. ప్రతి గదిలో గోడ గడియారం ఉండాలనే నిబంధనను అమలు చేయడంతో విద్యార్థులకు సమయ నిర్వహణలో కొంత సౌలభ్యం కలిగింది.

# కేంద్రంపై ఉమ్మడి పోరుకు సిద్ధం

**హైదరాబాద్, జూన్ 21:**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టం2025పై తెలంగాణ ప్రభుత్వం పోరాటానికి సిద్ధమవుతోంది. ఈ చట్టం వల్ల రాష్ట్రాలపై పడే ఆర్థిక భారం, గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ప్రభావాన్ని పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, డాక్టర్ వివేక్ వెంకటస్వామి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రాల హక్కులు, గ్రామీణ ఉపాధి పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని వీబీజీ రామ్‌జీ చట్టాన్ని న్యాయపరంగా, రాజ్యాంగపరంగా సవాల్ చేయాలని కమిటీ నిర్ణయించింది.

కొత్త చట్టం ద్వారా రాష్ట్రాలపై అదనంగా 40 శాతం ఆర్థిక భారం మోపడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని కమిటీ అభిప్రాయపడింది. రాష్ట్రాలను సంప్రదించకుండా తీసుకున్న ఈ నిర్ణయం సమంజసం కాదని పేర్కొంది. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతిపాదించిన మార్పులు కూలీల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

ఈ చట్టానికి వ్యతిరేకంగా ఒక్క తెలంగాణ మాత్రమే కాకుండా ఇతర విపక్ష పాలిత రాష్ట్రాలను కూడా కలుపుకుని ఉమ్మడి పోరాటం చేయాలని కమిటీ నిర్ణయించింది. కర్ణాటక, కేరళ, తమిళనాడు, జార్ఖండ్, పంజాబ్ తదితర రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి సంయుక్త కార్యాచరణకు రూపకల్పన చేయనున్నారు. అవసరమైతే అన్ని రాష్ట్రాలు కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాన్ని కూడా పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించారు. త్వరలో న్యాయ నిపుణుల అభిప్రాయాలను సేకరించి మరోసారి సమావేశమై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు కేబినెట్ సబ్ కమిటీ వెల్లడించింది.

# ఇళ్ల స్థలాల కోసం వామపక్షాల ఉద్యమ బాట

**మొదటిపేజీ తరువాయి**

వామపక్ష నాయకులు ప్రకటించారు. గుండ్ల సింగారం, గోపాల్‌పూర్ ప్రాంతాల్లో తొలగించిన గుడిసెల స్థానంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న హనుమకొండలో 10 వేల మందితో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం జూలై 1న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, కలెక్టరేట్ల వద్ద పెద్దఎత్తున నిరసనలు చేపడతామని తెలిపారు. అర్హులైన పేదల నుంచి దరఖాస్తులు సేకరించి జూలై 6న ఇందిరాపార్క్ వద్ద వేలాది మందితో ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పేదల నుంచి సేకరించిన దరఖాస్తులను అందజేస్తామని, ప్రభుత్వం స్పందన ఆధారంగా తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తామని వెల్లడించారు.

గుండ్ల సింగారంలో నాలుగేళ్లుగా నివసిస్తున్న పేదల గుడిసెలను అధికారులు, పోలీసులు అర్ధరాత్రి సమయంలో కూల్చివేయడం అమానుషమని విమర్శించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు అని చూడకుండా బలవంతంగా తరలించి వందల మందిని అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. అదే ప్రాంతంలో గతంలో కొందరికి పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం బాధితుల గుడిసెలను తొలగించడం అన్యాయమని అన్నారు. ఇతరుల ఆధీనంలో ఉన్న భూములపై చర్యలు తీసుకోకుండా పేదలపైనే కఠిన చర్యలు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు.

గుండ్ల సింగారం, గోపాల్‌పూర్ బాధితులకు వెలుగుమట్ల నమూనాలో ప్రత్యామ్నాయ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో లక్షలాది మంది పేదలు చిన్నచిన్న గుడిసెలు, మురికివాడల్లో జీవిస్తున్నారని తెలిపారు. భూదాన్, ప్రభుత్వ, మిగులు భూముల్లో దశాబ్దాలుగా నివసిస్తున్న పేదలందరికీ పట్టాలు మంజూరు చేయాలని వామపక్ష నేతలు ప్రభుత్వాన్ని కోరారు. పేదల గృహ హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# డెకరేషన్ గోదాంలో కెమికల్ బాక్స్ పేలి కార్మికుడి మృతి

**మొదటిపేజీ తరువాయి**

ఓ డెకరేషన్ గోదాంలో కెమికల్ బాక్స్ పేలడంతో ఓ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పేలుడు తీవ్రతకు కార్మికుడి శరీర భాగాలు ఘటనా స్థలంలో పడిపోయాయి. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళన నెలకొంది. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనూప్ ప్రధాన్ (35)గా పోలీసులు గుర్తించారు. ఉపాధి కోసం ఇటీవల కోల్‌కతా నుంచి నగరానికి వచ్చిన అనూప్ బడంగ్‌పేట్‌లోని డెకరేషన్ గోదాంలో పనికి చేరాడు. శనివారం గోదాంలో పనులు చేస్తున్న సమయంలో అక్కడ ఉన్న ఓ కెమికల్ బాక్స్ ఒక్కసారిగా పేలింది. పేలుడు ధాటికి తీవ్రంగా గాయపడిన అనూప్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పేలుడుకు అసలు కారణాలను గుర్తించేందుకు క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించారు. ఘటనా స్థలం నుంచి కీలక ఆధారాలను సేకరించారు. గోదాంలో ఎలాంటి రసాయనాలను నిల్వ చేశారు? అనుమతులు లేకుండా కెమికల్స్ ఉంచారా? అనే అంశాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. గోదాం నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రమాదానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## ఓవర్‌లోడ్ వాహనాలపై ఉక్కుపాదం

- రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు
- 100 వాహనాలు సీజ్.. భారీగా కేసుల నమోదు
- రెండోసారి పట్టుబడితే పర్మిట్, లైసెన్స్ రద్దు

**హైదరాబాద్, జూన్ 21:**

రాష్ట్రవ్యాప్తంగా ఓవర్‌లోడ్ వాహనాలపై రవాణా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. నిబంధనలకు విరుద్ధంగా అధిక భారంతో రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై శనివారం అర్ధరాత్రి నుంచి విస్తృత స్థాయిలో ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో భారీ సంఖ్యలో కేసులు నమోదు చేయడంతో పాటు 100 వాహనాలను అధికారులు సీజ్ చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక తనిఖీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు, ఆర్టీవోలు, మోటారు వాహనాల తనిఖీ అధికారులు, సహాయ మోటారు వాహనాల తనిఖీ అధికారులు పాల్గొన్నారు. రోడ్డు భద్రతను మెరుగుపరచడం, ప్రమాదాలను నివారించడం, రహదారుల నాణ్యతను కాపాడడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. అధిక లోడుతో నడిచే వాహనాల వల్ల రహదారులు దెబ్బతినడమే కాకుండా వంతెనలపై ఒత్తిడి పెరిగి ప్రమాదాలకు దారితీసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహన యజమానులు, క్వారీలు, మైనింగ్ కేంద్రాలు, పారిశ్రామిక సంస్థలకు నోటీసులు జారీ చేయనున్నట్లు జేటీసీ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. ఓవర్‌లోడ్‌కు పాల్పడిన వాహనం రెండోసారి పట్టుబడితే సంబంధిత పర్మిట్‌ను రద్దు చేయడంతో పాటు డ్రైవర్ లైసెన్స్‌ను కూడా సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని రవాణా శాఖ స్పష్టం చేసింది. నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని వాహన యజమానులు, డ్రైవర్లకు అధికారులు సూచించారు.

# జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్‌కు సమన్వయ సవాల్

- మూడు వర్గాల రాజకీయాలతో సమావేశం వాయిదాల పరంపర
- గ్రేటర్ ఎన్నికల ముందు క్యాడర్ ఏకీకరణపై అధిష్టానం దృష్టి

**హైదరాబాద్, జూన్ 21:**




తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశాలను వేగవంతం చేస్తున్నప్పటికీ, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మాత్రం ఇప్పటి వరకు అలాంటి సమావేశం నిర్వహించకపోవడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే రాష్ట్రంలోని 60కు పైగా నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తయ్యాయని సమాచారం. కేటీఆర్, హరీష్‌రావు స్వయంగా హాజరవుతూ కార్యకర్తలకు పార్టీ కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు, ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేస్తున్నారు.

అయితే గ్రేటర్ హైదరాబాద్‌లో కీలక నియోజకవర్గంగా భావించే జూబ్లీహిల్స్‌లో సమన్వయ సమావేశం పదేపదే వాయిదా పడుతోంది. తొలుత గ్రేటర్‌లోనే ముందుగా ఈ నియోజకవర్గ సమావేశం నిర్వహించాలని పార్టీ భావించినా, అనేక కారణాలతో అది సాధ్యపడలేదని తెలుస్తోంది.

పార్టీ వర్గాల సమాచారం ప్రకారం జూబ్లీహిల్స్‌లో నాయకత్వ పోటీ ప్రధాన సమస్యగా మారింది. ఉపఎన్నికల తర్వాత నియోజకవర్గంలో మూడు వర్గాలు ఏర్పడ్డాయనే చర్చ సాగుతోంది. ఉపఎన్నికలో పోటీ చేసిన మాగంటి సునీత ఒక వర్గానికి నాయకత్వం వహిస్తుండగా, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి మరో వర్గంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ఇద్దరి అనుచరుల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోందన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ఇక చాలా కాలంగా నియోజకవర్గ రాజకీయాలపై దృష్టి సారించిన రావుల శ్రీధర్ రెడ్డి కూడా ఇక్కడ కీలక పాత్ర కోరుతున్నట్లు సమాచారం. దీంతో ముగ్గురు నేతల మధ్య సమన్వయం కుదర్చడం పార్టీ అధిష్టానానికి సవాలుగా మారినట్లు చెబుతున్నారు.

సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఇంచార్జిగా విష్ణువర్ధన్ రెడ్డిని నియమించినప్పటికీ, నియోజకవర్గంలోని ఇతర నాయకులతో పూర్తి స్థాయి సమన్వయం ఇంకా సాధ్యపడలేదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇతర నియోజకవర్గాల్లో నాయకుల మధ్య ఏకాభిప్రాయం ఏర్పరిచిన తర్వాతే కార్యకర్తల సమావేశాలు నిర్వహించగా, జూబ్లీహిల్స్‌లో మాత్రం నాయకత్వ విభేదాలే ప్రధాన అడ్డంకిగా నిలిచినట్లు తెలుస్తోంది.

రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జూబ్లీహిల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన బీఆర్ఎస్ అధిష్టానం, నాయకుల మధ్య విభేదాలను పరిష్కరించి క్యాడర్‌ను ఒకే వేదికపైకి తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. త్వరలోనే సమన్వయం సాధించి కేటీఆర్ సమక్షంలో కార్యకర్తల సమావేశం నిర్వహించే అవకాశాలు ఉన్నాయని పార్టీ నాయకులు చెబుతున్నారు.

# బీఆర్ఎస్ అంటే భారత రాబందుల సమితి: అద్దంకి దయాకర్

- కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ తీవ్ర విమర్శలు
- హైదరాబాద్ భూముల దోపిడీపై ఆరోపణలు
- మూసీ, హెచ్‌సీయూ భూములపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు

**హైదరాబాద్, జూన్ 21:**

బీఆర్ఎస్ పార్టీని ఇకపై "భారత రాబందుల సమితి"గా పిలవాలని శాసన మండలిలో ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో హైదరాబాద్ పరిసర ప్రాంతాల భూములను రాబందుల్లా దోచుకున్నారని ఆరోపించారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన ప్రతిపక్షం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని విమర్శించారు.

బీఆర్ఎస్ నాయకత్వం ప్రజా సమస్యలపై పోరాటం చేయకుండా ప్రభుత్వం పై నిరాధార ఆరోపణలు చేస్తోందని అన్నారు. కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదని, రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి ప్రజలకు స్పష్టమైన అవగాహన ఉందని పేర్కొన్నారు. రాజకీయాల్లో విలువలు, బాధ్యతలు పాటించాలని కేటీఆర్‌కు సూచించిన అద్దంకి దయాకర్, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ సమర్థవంతంగా వ్యవహరించకుండా కేటీఆర్‌ను ముందుకు తెస్తున్నారని విమర్శించారు.

కేటీఆర్ సమావేశాలు, కార్యక్రమాల వల్ల బీఆర్ఎస్‌కు రాజకీయంగా ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. హైదరాబాద్‌కు సంబంధించిన భూముల వ్యవహారాల్లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలపై ప్రజలకు పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు.

ఎస్బీఐ భూముల అంశాన్ని ప్రస్తావిస్తూ, ప్రభుత్వం కేటాయించిన భూముల్లో నిర్మాణాలు జరగలేదని తెలిపారు. భూముల వేలం ప్రక్రియను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. హెచ్‌సీయూ భూముల వ్యవహారంలో రాష్ట్రానికి ఆదాయం సమకూరే అవకాశాలను కూడా దుష్ప్రచారంతో దెబ్బతీయాలని చూస్తున్నారని విమర్శించారు.

మూసీ అభివృద్ధి ప్రాజెక్టుపై కూడా బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని అద్దంకి దయాకర్ ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలపై ప్రజలు వాస్తవాలను గుర్తిస్తున్నారని, బీఆర్ఎస్ ఆరోపణలను నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజలే నిర్ణయిస్తారని, నిరాధార విమర్శలతో రాజకీయ లబ్ధి పొందడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు.

# బొగ్గు మాయం ఆరోపణల్లో నిజం లేదు: సింగరేణి

**హైదరాబాద్, జూన్ 21:**

సింగరేణి కాలరీస్ బొగ్గు నిల్వల్లో భారీగా తేడాలు ఉన్నాయని, పెద్ద ఎత్తున బొగ్గు మాయమైందంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. బొగ్గు ఉత్పత్తి నుంచి వినియోగదారుడికి చేరే వరకు ప్రతి ప్రక్రియ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, బహుళ స్థాయి భద్రతా వ్యవస్థల మధ్య పూర్తిస్థాయి పారదర్శకతతో సాగుతోందని వెల్లడించింది.

బొగ్గు నిల్వల వ్యవహారంపై కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న రూ.1600 కోట్ల కుంభకోణం ఆరోపణలను యాజమాన్యం ఖండించింది. ఈ అంశంపై కొన్ని మాధ్యమాల్లో వస్తున్న కథనాలు వాస్తవాలకు విరుద్ధమని పేర్కొంటూ వివరణాత్మక ప్రకటన విడుదల చేసింది.

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుడికి చేరే వరకు ప్రతి దశను డిజిటల్ విధానంలో నమోదు చేస్తున్నామని అధికారులు తెలిపారు. సంస్థలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా రవాణా అవుతుందని వివరించారు. వినియోగదారుల వివరాలు, గనుల సమాచారం, సరఫరా పరిమాణం, షెడ్యూల్ వంటి అంశాలన్నీ ముందుగానే డిజిటల్ వ్యవస్థలో నమోదు అవుతాయని పేర్కొన్నారు.



రోడ్డు మార్గంలో బొగ్గు తరలించే ప్రతి వాహనాన్ని ఎలక్ట్రానిక్ తూకం యంత్రాల ద్వారా పరిశీలిస్తున్నామని తెలిపారు. జీపీఎస్, జీపీఆర్ఎస్, జియో ఫెన్సింగ్ సాంకేతికతల సహాయంతో వాహనాల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. నిర్ణయించిన మార్గాన్ని వాహనం విడిచిపెడితే వెంటనే వ్యవస్థ అప్రమత్తం చేస్తుందని చెప్పారు.


రైల్వే వ్యాగన్లలో బొగ్గు లోడింగ్, తరలింపు ప్రక్రియ కూడా పూర్తిగా డిజిటల్ పర్యవేక్షణలోనే జరుగుతోందని అధికారులు తెలిపారు. గనులు, బొగ్గు నిల్వ కేంద్రాలు, తూకం కేంద్రాలు, రైల్వే సైడింగ్‌లు, ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ వ్యవస్థలు, భద్రతా సిబ్బంది ద్వారా 24 గంటల నిఘా కొనసాగుతోందన్నారు.

అంతేకాకుండా ఆకస్మిక తనిఖీలు, ప్రత్యేక భద్రతా గస్తీ చర్యలు కూడా నిరంతరం నిర్వహిస్తున్నామని సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. బొగ్గు నిల్వలు, రవాణాపై వస్తున్న నిరాధార ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరింది.

# కరీంనగర్‌లో ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సు దగ్ధం

**అలుగునూర్ శివారులో ఘటన**

కరీంనగర్, జూన్ 21: కరీంనగర్ జిల్లాలో ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సు అగ్నిప్రమాదానికి గురైంది. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. అయితే డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఆదివారం ఉదయం 8 గంటలకు 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయల్దేరింది. అలుగునూర్ శివారులోని కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే బస్సులో షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదాన్ని గుర్తించిన డ్రైవర్ ప్రశాంత్ వెంటనే బస్సును రోడ్డుపక్కన నిలిపి ప్రధాన ద్వారంతో పాటు అత్యవసర ద్వారాలను తెరిచారు. ప్రయాణికులందరినీ వేగంగా బయటకు పంపించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రయాణికులను సురక్షితంగా దించిన అనంతరం డ్రైవర్, సిబ్బంది బస్సులో ఉన్న అగ్నిమాపక పరికరాలతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయితే మంటలు వేగంగా వ్యాపించడంతో వాటిని నియంత్రించడం సాధ్యపడలేదు. కేవలం ఐదు నిమిషాల్లోనే మంటలు బస్సు మొత్తం వ్యాపించి వాహనం పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే ప్రమాదం జరిగిన తర్వాత కూడా అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా చేరుకున్నారని స్థానికులు ఆరోపించారు. ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.



# ఎన్నికల్లో సున్నా... ఇప్పుడు ఖాతాలో ఇరవై!

## పార్లమెంటులో ఐదో పెద్ద పార్టీగా ఎన్‌సీపీఐ?

## ఫిరాయింపులతో కొత్త రాజకీయ సమీకరణాలు!

(ఆంధ్ర మనం, ప్రత్యేక ప్రతినిధి)

దేశ రాజకీయాల్లో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఎన్నికల్లో ఒక్క లోక్‌సభ స్థానం కూడా గెలుచుకోని ఒక చిన్న పార్టీ అకస్మాత్తుగా జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారడం ఆసక్తి రేకెత్తిస్తోంది. పశ్చిమ బెంగాల్ రాజకీయ పరిణామాల నేపథ్యంలో నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) పేరు ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలు పార్టీకి దూరమై ఎన్‌సీపీఐలో చేరనున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామం నిజమైతే పార్లమెంటులో ఆ పార్టీ స్థానం ఒక్కసారిగా మారిపోతుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు పెద్దగా గుర్తింపు లేని పార్టీగా ఉన్న ఎన్‌సీపీఐ, లోక్‌సభలో ఐదో అతిపెద్ద పార్టీగా అవతరించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం టీఎంసీలో అసంతృప్తి పెరిగినట్లు వార్తలు వస్తున్నాయి. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ నాయకత్వంపై కాకపోయినా, పార్టీలోని కొన్ని వర్గాల ఆధిపత్యంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే కొందరు ప్రజాప్రతినిధులు కొత్త రాజకీయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. విశేషమేమిటంటే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, దాని విధానాలను తీవ్రంగా విమర్శించిన నేతలే ఇప్పుడు కొత్త రాజకీయ సమీకరణాల దిశగా అడుగులు వేస్తున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దీంతో రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరన్న నానుడి మరోసారి చర్చకు వస్తోంది. ఎన్‌సీపీఐ ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా పెద్దగా ప్రభావం చూపిన పార్టీ కాదు. త్రిపురలో జరిగిన ఎన్నికల్లో పరిమిత స్థాయిలో మాత్రమే పోటీ చేసింది. ఆ పార్టీ ప్రధానంగా ఫిరాయింపు రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించడం అప్పట్లో విశేషంగా నిలిచింది. అయితే ఇప్పుడు అదే పార్టీ ఫిరాయింపుల ద్వారా రాజకీయంగా బలపడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ సమీకరణాల వెనుక కేంద్ర రాజకీయాల ప్రభావం ఉందన్న ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. లోక్‌సభలో సంఖ్యాబలం పెంచుకోవడం, భవిష్యత్ రాజ్యాంగ సవరణలు లేదా కీలక బిల్లుల ఆమోదానికి అవసరమైన మద్దతు కూడగట్టుకోవడం వంటి లక్ష్యాలతో ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రచారాలపై ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి స్పష్టత రాలేదు. టీఎంసీ, ఎన్‌సీపీఐ లేదా ఎన్డీఏ వర్గాల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. దీంతో రాజకీయ వర్గాల దృష్టి ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌పైనే కేంద్రీకృతమైంది. ఈ పరిణామాలు ఎంతవరకు వాస్తవ రూపం దాలుస్తాయో, దేశ రాజకీయాల్లో ఇంకెన్ని కొత్త మలుపులకు దారి తీస్తాయో వేచి చూడాల్సి ఉంది.

# యోగ భారతీయ సంస్కృతికి అమూల్యమైన కానుక

## భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**జబల్‌పూర్, జూన్ 21:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో నిర్వహించిన సామూహిక యోగా ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ విదేశాల్లోని యోగా సాధకులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్రపతి, మానవాళికి ఆరోగ్యకరమైన, సమతుల్యమైన, అర్థవంతమైన జీవితాన్ని చూపించిన భారతదేశపు గొప్ప సంప్రదాయాన్ని నేడు ప్రపంచం గౌరవిస్తోందని అన్నారు. యోగ అనేది భారతీయ సంస్కృతి ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మిక వికాసానికి యోగ ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్రపతి వివరించారు. వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడులు, అనారోగ్య సమస్యలను ఎదుర్కోవడంలో యోగ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో యోగకు పెరుగుతున్న ఆదరణ భారతీయ జ్ఞాన సంపద గొప్పతనానికి నిదర్శనమని ఆమె అభిప్రాయపడ్డారు. భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలకు చెందిన ప్రజలను యోగ ఒకే వేదికపైకి తీసుకువస్తోందని పేర్కొన్నారు. ఈ ఏడాది యోగా దినోత్సవాన్ని "ఆరోగ్యవంతమైన వృద్ధాప్యానికి యోగ" అనే ప్రధాన అంశంతో నిర్వహించడం ఎంతో సముచితమని రాష్ట్రపతి అన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ యోగ సాధన ద్వారా ఆరోగ్యంగా, చురుకుగా జీవించవచ్చని సూచించారు. యోగను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చిన రాష్ట్రపతి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగ అత్యంత ప్రభావవంతమైన సాధనమని పేర్కొన్నారు. యోగ ద్వారా శరీరం, మనసు, ఆత్మ మధ్య సమతుల్యత సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యోగా సాధకులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

# భారత నౌకాదళంలో మూడు కొత్త యుద్ధ నౌకలు


- కోల్‌కతాలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- సముద్ర భద్రతలో మరో కీలక అడుగు
- ఆత్మనిర్భర్ భారత్‌కు నిదర్శనమన్న మోదీ



**కోల్‌కతా, జూన్ 21:** భారత నౌకాదళ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా ఐఎన్ఎస్ దునాగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్ అనే మూడు నౌకలను ప్రధాని నరేంద్ర మోదీ కోల్‌కతాలో అధికారికంగా జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా దేశ రక్షణ రంగంలో స్వావలంబన సాధనకు భారత్ వేగంగా ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ నౌకలు భారత సముద్ర భద్రతను మరింత పటిష్టం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ప్రధాని తెలిపారు. దేశ సముద్ర సరిహద్దుల రక్షణ, వ్యూహాత్మక అవసరాల నిర్వహణ, సముద్ర పర్యవేక్షణ సామర్థ్యాల పెంపులో ఇవి ఉపయోగపడనున్నాయని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, దేశీయ రక్షణ తయారీ రంగ సామర్థ్యాలతో ఈ నౌకలు రూపొందించబడటం విశేషమని మోదీ పేర్కొన్నారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో భారత్ స్వయం సమృద్ధి వైపు వేగంగా అడుగులు వేస్తోందని అన్నారు. భారత నౌకాదళం ఆధునికీకరణలో భాగంగా కొత్త సాంకేతికతతో రూపొందించిన యుద్ధ నౌకలు, సర్వే నౌకలు, సహాయక నౌకలను దశలవారీగా సేవల్లోకి తీసుకువస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత వ్యూహాత్మక ఆధిపత్యం మరింత బలపడనుంది. ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో సముద్ర భద్రతకు ప్రాధాన్యం పెరుగుతున్న తరుణంలో ఈ నౌకల చేరిక కీలకమని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సముద్ర మార్గాల్లో జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు ఇవి తోడ్పడనున్నాయి. ఖభారత నౌకాదళం శక్తివంతంగా మారడం ద్వారా దేశ భద్రతతో పాటు స్వదేశీ రక్షణ పరిశ్రమకు కూడా కొత్త అవకాశాలు లభిస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశీయ తయారీ సామర్థ్యాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు దోహదపడుతున్నాయని ఆయన వెల్లడించారు.

# విద్యార్థుల కోసం మోదీ నిరీక్షణ

- నీట్ పరీక్షకు ఆటంకం కలగకుండా నిర్ణయం
- 45 నిమిషాలపాటు విమానాశ్రయంలోనే ప్రధాని
- విద్యార్థుల ప్రయోజనాలకే ప్రాధాన్యం



**న్యూఢిల్లీ, జూన్ 21:** విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక పరీక్ష సమయంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రత్యేక నిర్ణయం తీసుకున్నారు. కోల్‌కతాలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన వెంటనే తన అధికారిక నివాసానికి వెళ్లకుండా అక్కడే నిరీక్షించారు. సాధారణంగా ప్రధాని ప్రయాణాల సమయంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉంటాయి. రహదారులపై ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలపై తాత్కాలిక ఆంక్షలు విధించడం వంటి చర్యలు చేపడతారు. అయితే అదే సమయంలో దేశవ్యాప్తంగా నీట్ యూజీ పరీక్ష జరుగుతుండటంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే వేళ ఎలాంటి ఆటంకాలు ఏర్పడకూడదని భావించినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం 1.15 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని సుమారు 45 నిమిషాలపాటు అక్కడే ఉన్నారు. నీట్ పరీక్ష ప్రారంభ సమయం సమీపిస్తున్న నేపథ్యంలో తన కాన్వాయ్ ప్రయాణం వల్ల ట్రాఫిక్‌పై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు సూచించినట్లు సమాచారం. దీంతో పరీక్ష రాసే విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయన వేచి ఉండాలని నిర్ణయించుకున్నారు.

నీట్ పరీక్ష దేశంలోని అత్యంత కీలక ప్రవేశ పరీక్షల్లో ఒకటి. వైద్య విద్యలో ప్రవేశాల కోసం లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతుంటారు. పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి ముందే చేరుకోవాల్సి ఉండటంతో రహదారులపై చిన్న అంతరాయం కూడా అభ్యర్థులకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉంటుంది. ఈ అంశాన్ని ప్రధాని పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన తర్వాత మాత్రమే ప్రధాని విమానాశ్రయం నుంచి బయల్దేరి తన అధికారిక నివాసానికి వెళ్లారు. దీంతో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంలో వారికి ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహరించిన ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో కూడా విస్తృతంగా స్పందనలు వ్యక్తమవుతున్నాయి.

# నీట్ రీఎగ్జామ్..

## 22 లక్షల మంది హాజరయ్యే ఛాన్స్

**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూసిన నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ ఆదివారం (జూన్ 21) ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా దాదాపు 22 లక్షల మంది వరకు అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా. గత నెల 3న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడంతో రద్దైన సంగతి తెలిసిందే. ఈ పరీక్ష జరిపే నిర్వహణా సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీయే) దీన్ని రద్దు చేసింది. తిరిగి ఇవాళ మరోసారి పరీక్ష నిర్వహిస్తోంది. గత అనుభవాల్ని దృష్టిలో ఉంచుకుని ఈసారి కట్టుదిట్టమైన భద్రత మధ్య పరీక్ష నిర్వహిస్తోంది. పోలీసులతోపాటు, సీఆర్పీఎఫ్ సహా వివిధ విభాగాలకు చెందిన భద్రతా బలగాల పహారా మధ్య పరీక్ష ప్రారంభమైంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష జరగనుంది. గతంలో మూడు గంటలు.. అంటే మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే పరీక్ష జరిగేది. కానీ, ఈసారి అభ్యర్థుల సౌకర్యార్థం 15 నిమిషాలు అదనంగా సమయం కేటాయించారు. అలాగే, రఫ్ వర్క్ కోసం బుక్‌లెట్‌లో అదనపు పేజీల్ని కూడా కేటాయించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ ఫార్ములా కోంస ఈ రఫ్ వర్క్ పేపర్స్ ఉపయోగపడతాయి. దేశవ్యాప్తంగా 551 పట్టణాలు, నగరాల్లో 5,440 కేద్రాల్లో ఈ పరీక్ష జరుగుతోది. ఇందులో 14 విదేశీ కేంద్రాలు కూడా ఉన్నాయి. ఇంగ్లీష్‌తోపాటు 12 ప్రాంతీయ భాషల్లో ఈ పరీక్ష ఉంటుంది. దాదాపు 95,000కుపైగా గదులను పరీక్ష కోసం కేటాయించారు. అన్నింట్లోనూ సీసీటీవీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా దాదాపు 1,38,560 కెమెరాలు, 51,311 జామర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచే విద్యార్థుల్ని పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు అనుమతి ఉంది. ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించరు. పరీక్షలు జరిగే చోట అధికారులు ప్రత్యేక రవాణా సదుపాయాలు ఏర్పాటు చేశారు.

# యోగా మానవాళిని ఏకం చేస్తుంది

## కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

- షిల్లాంగ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు
- యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపు
- తూర్పు వైమానిక దళ కేంద్రంలో యోగాభ్యాసం



**షిల్లాంగ్, జూన్ 21 :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లోని తూర్పు వైమానిక దళ కమాండ్ కేంద్రంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగాసనాలు సాధించిన ఆయన యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగం కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, ప్రపంచవ్యాప్తంగా మానవాళిని ఒకే వేదికపైకి తీసుకువచ్చే జీవన విధానమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశాలు, ఖండాలు, సంస్కృతుల మధ్య ఉన్న భేదాలను అధిగమించి ప్రజలను ఏకం చేసే శక్తి యోగాకు ఉందని అన్నారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి యోగా అత్యంత ప్రభావవంతమైన సాధనమని ఆయన చెప్పారు. శరీర ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా యోగాకు లభిస్తున్న ఆదరణ భారతీయ సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. భారతదేశం వేల ఏళ్ల క్రితం ప్రపంచానికి అందించిన ఈ అమూల్యమైన సంపద నేడు కోట్లాది మందికి ఆరోగ్యవంతమైన జీవనానికి మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని యోగాభ్యాసానికి కేటాయించడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్లో లక్షలాది మంది ప్రజలు పాల్గొన్నారు. ఆరోగ్యకర జీవనశైలికి యోగా ఉత్తమ మార్గమని మరోసారి ఈ వేడుకలు చాటిచెప్పాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

# యూరియా గోస..

## ఉప్పలవాయిలో రోడ్డెక్కిన రైతన్నలు!

- యాప్ విధానం రద్దు చేయాలంటూ జాతీయ రహదారిపై రాస్తారోకో
- గంటల తరబడి నిలిచిన వాహనాలు..
- పోలీసుల జోక్యంతో సర్దుమణిగిన ఉద్రిక్తత





**రామారెడ్డి రాజముద్ర న్యూస్:**

వానకాలం సీజన్ మొదలైందో లేదో అప్పుడే అన్నదాతలకు 'యూరియా' కష్టాలు మొదలయ్యా యి. ఒకవైపు ఆకాశం వైపు చూస్తూ.. కష్టపడి సాగు చేసుకుంటున్న రైతులకు కొత్తగా తీసుకొచ్చి న ఆన్‌లైన్ యాప్ విధానం శాపంగా మారింది. తమకు స్మార్ట్‌ఫోన్లు వాడటం రాదని, సర్వర్లు పని చేయడం లేదని, తక్షణమే యాప్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే సొసైటీల ద్వారా యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా ఉప్పలవాయిలో రైతులు భారీ ఎత్తున రోడ్డెక్కారు. యాప్ తిప్పలు.. అన్నదాతల ఆక్రందనలు ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మొబైల్ యాప్ బుకింగ్ విధానంపై రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. యాప్‌లో లాగిన్ అవ్వడమే గగనంగా మారిందని, ఒకవేళ ఓపెన్ అయినా క్షణాల్లో 'నో స్టాక్' (స్టాక్ అయిపోయింది) అని చూపిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశా రు. చదువుకోని వృద్ధ రైతులు, గిరిజన తండాల రైతులకు అసలు ఈ యాప్ ఎలా వాడాలో కూడా తెలియక దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. "మాకు స్మార్ట్ ఫోన్లు లేవు.. ఒకవేళ పక్కోళ్ల ఫోన్ తెచ్చుకున్నా అందులో యాప్ నడవడం లేదు. గంటల తరబడి లైన్లలో నిలబడినా లాభం లేకుం డా పోతోంది. పాత పద్ధతిలోనే మా పాస్‌బుక్కులు చూసి యూరియా బస్తాలు ఇవ్వాలి.యూరియా కొరత, యాప్ తిప్పలపై విసిగిపోయిన ఉప్పలవా యి, పరిసర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో తర లివచ్చి జాతీయ రహదారిపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దీంతో హైవేపై ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుపై బైఠాయించిన రైతులతో చర్చలు జరిపారు. ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్లి యూరియా కొరత లేకుండా చూస్తామని, సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు తమ నిరసనను విరమించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.తమ సమస్యను తక్షణమే పరిష్కరించి, ఈ యాప్ విధానాన్ని పూర్తిగా ఎత్తివేయకపోతే రాబోయే రోజుల్లో ఆందో ళనలను మరింత ఉధృతం చేస్తామని రైతన్నలు హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో, మాజీ సొసైటీ డైరెక్టర్ నారాయణరెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ ఆల పర్వారెడ్డి, రాజేందర్, లక్ష్మణ్, హనుమాన్లు, గంగారం,, లింగం, నర్సింలు,, అశోక్ రెడ్డి, రాములు, ప్రసన్న కుమార్, అజయ్, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి నిల్...

# అక్రమం ఫుల్

### రామ్ నరేష్ నగర్ లో జీరో పర్మిషన్ సైట్..?
### అధికారులకు లక్షల్లో ముడుపులు..!
### అందుకే చర్యలు శూన్యం అంటున్న స్థానికులు..

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ ;**



కూకట్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. హైదరాబాదులో హైడ్రా కాదు కదా అంతకు మించి ఇంకేమైనా చట్టాలు వచ్చినా అవన్నీ మాకు చుట్టాలే అవుతాయి కానీ మాలాంటి బిల్డర్ లను ఏమీ చేయలేవు అని ఒక విధమైన గర్వంతో అధికారులకు సవాళ్లు విసురుతున్నారు కొందరు అక్రమ నిర్మాణ దారులు. వివరాల్లోకి వెళితే కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని హైదర్ నగర్ డివిజన్ రామ్ నరేష్ నగర్ లో ఒక నిర్మాణ దారుడు స్థానిక టౌన్ ప్లానింగ్ విభాగం నుండి అధికారికంగా ఎటువంటి అనుమతులు పొందకుండా జి+5 అంతస్తులతో అక్రమ నిర్మాణం చేపట్టాడు. అధికారికంగా అనుమతులు పొందలేదేమో కానీ.. అనధికారికంగా మాత్రం ఆఫీసర్ లకు లక్షల్లో ముడుపులు ముట్టజెప్పినట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలో నాక్ ఇంజనీర్ నుండి మొదలుకొని డిప్యూటీ కమిషనర్ వరకు అందరికీ కానుకలు సమర్పించి ఉంటారు కాబట్టే అక్రమంగా నిర్మిస్తున్నా అధికారులు కిక్కురు మనకుండా ఉన్నారని విమర్శలు గుప్పుమంటున్నాయి. ప్రజలకు ప్రభుత్వానికి సమాధానం చెప్పడానికైనా సదరు నిర్మాణం పై చర్యలు చేపట్టి బిల్డింగు ను సీజ్ చేస్తారో లేక ఎలాగూ మనకు రావలసిన వాటా మనకు వచ్చింది కదా ఎవరు ఏమనుకుంటే పోయేదేముందిలే అని గమ్మున ఉంటారో వేచి చూడాలి.

## మియాపూర్ లో 5 కే రన్ తో యోగా దినోత్సవం,

# ఫాదర్స్ డే వేడుకలు

**వర్షం లోనూ ఉత్సాహంగా పాల్గొన్న చిన్నా పెద్దలు**

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :**



ప్రపంచ యోగ దినోత్సవం, ఫాదర్స్ డే సందర్భంగా మియాపూర్ లక్ష్మీస్ ఎంపీరియా కమ్యూనిటీ ఆధ్వర్యంలో 5 కె. రన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కమ్యూనిటీ ప్రెసిడెంట్ శ్రీను ముప్పరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ రన్‌ను మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, "ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత. పర్యావరణ పరిరక్షణకు కూడా మన వంతు కృషి చేయాలి" అన్నారు. ఆరోగ్యం, ఫిట్‌నెస్, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచే లక్ష్యంతో నిర్వహించిన ఈ రన్‌లో చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వర్షం పడుతున్నా వెనుకాడకుండా పరుగెత్తి ఆరోగ్యకరమైన జీవన విధానానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్లాటినమ్ స్కూల్స్, కాల్షియం హాస్పిటల్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, శ్రీకార జూనియర్ కాలేజ్, లక్ష్మీ ఇన్‌ఫ్రా, క్యాస్కేడ్స్ ది నియోపోలిస్ సంస్థలు స్పాన్సర్లుగా సహకరించాయి.

# లింగంపల్లిని జిల్లాకే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ప్రజల దీవెనలే మాకు ముఖ్యం సర్పంచ్ వడ్ల శోభా పరమేశ్వర్
- వార్డు సభ్యులతో కలిసి సమగ్ర అభివృద్ధికి కృషి నూతన పాలకవర్గం

**వికారాబాద్ రాజముద్ర న్యూస్ :**



వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామ అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. గ్రామ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవనే పరమావధిగా భావిస్తూ నూతన పాలకవర్గం గ్రామాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది. గ్రామ సర్పంచ్ వడ్ల శోభా పరమేశ్వర్ వార్డు సభ్యుల నాయ కత్వంలో గ్రామంలో మౌలిక వసతు ల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సమస్యల పరిష్కారం, వీధి దీపాల ఏర్పాటు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ పాలకవర్గం పని చేస్తోంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వడ్ల శోభ పరమేశ్వర్ మాట్లాడుతూ గ్రామంలోని వీధుల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, దోమల నివారణ కోసం గడ్డి మందు పిచికారీ చేయించడం, తాగునీటి సరఫరాను బలోపేతం చేయడం వంటి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఇంటికి మౌలిక సదుపాయాలు అందించాలనే సంకల్పంతో నూతన పాలకవర్గం పని చేస్తోందని సర్పంచ్ వడ్ల శోభా పరమేశ్వర్ తెలిపారు. వార్డు సభ్యులు, పాలకవర్గ సభ్యులు కూడా గ్రామాభివృద్ధిలో భాగస్వాములవుతూ ప్రజలతో నిరంతరం మమేకమవుతున్నారు. గ్రామంలో విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణ వంటి అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయనున్నట్లు పాలకవర్గం వెల్లడించింది. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టి లింగంపల్లి గ్రామాన్ని జిల్లాకే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేసింది.



# అంబేద్కర్ ఆశయాలే సమాజానికి మార్గదర్శకం

**కీసర, రాజముద్ర న్యూస్:**

బడుగు బలహీన, పేద వర్గాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేందుకు సమానత్వంకై రాజ్యాంగంలో ప్రత్యేక చట్టాలను పొందుపరిచిన మహాయోధుడు భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ అని రాష్ట్ర నక్కల పిట్టల సంఘం ఉపాధ్యక్షుడు, కీసర మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పిట్టల రాము పేర్కొన్నారు. ఆదివారం కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్, ప్రధాన కార్యదర్శి మంచాల సంజీవ ఆధ్వర్యంలో 228వ వారం జ్ఞానమాల కార్యకమం ఘనంగా నిర్వహించారు. మండల కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిధిగా పిట్టల రాము విచ్చేసి జ్ఞానమాల సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జై భీం నినాదాలు చేస్తూ దేశ ప్రజలకు అంబేద్కర్ ఆశయాలే మార్గదర్శకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు గోరంటి ప్రవీణ్, బొల్లి మహేష్, కోశాధికారి రొండ్ల మహేష్, సంయుక్త కార్యదర్శిలు మంచాల మహేష్, కుర్రి పరమేష్, పిట్టల సంఘం నాయకులు పిట్టల బాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ స్టేషన్ పరిధిలో మహిళా అదృశ్యం

**కుషాయిగూడ, రాజముద్ర న్యూస్:**



కుషాయిగూడ పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం నాగారం నివాసి పెంట శ్రీను తన భార్య రమాదేవి (33) కని పించడం లేదని కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పెంట శ్రీను కు సుమారు 15 సంవత్సరాల క్రితం రమాదేవితో వివాహం కాగా, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత మూడు రోజుల క్రితం రమాదేవి ఎక్కువగా ఫోన్ ఉపయోగిస్తోందని ఆమెను భర్త మందలించినట్లు తెలిపాడు. అనంతరం కుటుంబ సభ్యులు హెచ్‌బి కాలనీ లోని వసుంధర డిగ్రీ కాలేజీలో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ అక్కడే నివాసం ఉంటున్న అతని తల్లిదండ్రుల ఇంటికి శుక్రవారం వెళ్లారు. మరుసటి రోజు పెంట శ్రీను నాగారం ఉన్న తన ఇంటికి వెళ్లగా, రమాదేవి హెచ్‌బి కాలనీలోనే ఉన్నది. అదే రోజు మధ్యాహ్నం సుమా రు 2:45 గంటల సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు తమ తమ పనుల్లో ఉండ గా, రమాదేవి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. అనంతరం ఆమె కోసం చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లు తెలిసిన ప్రదేశాల్లో గాలించినప్పటికీ ఎటువంటి సమాచారం లభించలేదు. ఆమె వద్ద ఎటు వంటి సెల్‌ఫోన్ కూడా లేదని ఫిర్యాదు దారు తెలిపాడు. ఈ మేరకు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### బీజేపీ రాష్ట్ర కమిటీ జాయింట్ కన్వీనర్‌గా

## ఫణి భూషణ్ చింతపల్లి నియామకం



**కాప్రా, రాజముద్ర న్యూస్:** భారతీ య జనతా పార్టీ (బీజేపీ) తెలంగాణ ఎండోమెంట్ సెల్ రాష్ట్ర కమిటీ జాయింట్ కన్వీనర్‌గా ఫణి భూషణ్ చింతపల్లిని పార్టీ నాయకత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. అనం తరం ఫణి భూషణ్ చింతపల్లి మాట్లా డుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎండోమెంట్ సెల్ ద్వారా దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధి, హిందూ ధార్మిక సంప్రదాయాల పరిరక్షణ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా నిరంతర కార్యాచరణ ద్వారా ఎండోమెంట్ సెల్‌ను మరింత బలోపేతం చేసి, దేవాలయాల అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, హిందూ ధార్మిక విలువల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. 2028-29 నాటికి తెలంగాణ రాష్ట్రంలో డబులింజన్ బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో పార్టీ నాయకత్వం ముందుకు సాగుతోందని, ఆ దిశగా ప్రతి కార్యకర్త సమిష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. దేవాలయాల రక్షణ, ధర్మ పరిరక్షణ, దేశ సేవే లక్ష్యంగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని ఫణి భూషణ్ చింతపల్లి తెలిపారు.

## నేడు ఎమ్మెల్యే రాక ..

### పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :**

రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామంలో సిసి రోడ్లు, ఎస్ హెచ్ జి బిల్డింగ్, రామారెడ్డిలో పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రారంభోత్సవం చేస్తారని మండల ప్రెసిడెంట్ ప్రవీణ్ గౌడ్, తెలిపారు, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని తెలిపారు.



# ప్లేట్‌లెట్లను పెంచే ఆహారాలు ఇవి..

**వీటిని తీసుకుంటే జ్వరం కూడా త్వరగా తగ్గిపోతుంది..**

వర్షాకాలం నేపథ్యంలో చాలా మంది దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులతోపాటు దోమల వల్ల వచ్చే డెంగీ, మలేరియా వంటి జ్వరాలతోనూ బాధపడుతుంటారు. ఈ క్రమంలో సాధారణ దగ్గు, జలుబు అయితే కొన్ని రోజుల్లో తగ్గిపోతాయి. కానీ విష జ్వరాలు వస్తే డాక్టర్‌ను కలిసి చికిత్స తీసుకోవాల్సిందే. ఈ క్రమంలో డాక్టర్లు ఇచ్చే మందులను క్రమం తప్పకుండా వాడడంతోపాటు ఆహారం విషయంలోనూ పలు మార్పులు చేసుకోవాలి. దీంతో జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. అంతేకాకుండా జ్వరం కారణంగా శరీరంలో తగ్గిన ప్లేట్‌లెట్లు మళ్లీ ఉత్పత్తి అవుతాయి. దీంతో త్వరగా రికవరీ అవుతారు. తిరిగి ఉత్సాహంగా పనిచేస్తారు. సాధారణంగా డెంగీ వచ్చినప్పుడు మాత్రమే కాకుండా ఇతర విష జ్వరాలు వచ్చినప్పుడు కూడా ప్లేట్‌లెట్లు పడిపోతాయి. రక్తంలో ఉన్న వాటి సంఖ్య ఒకేసారి క్షీణిస్తుంది. దీంతో ఆరోగ్యం మరింత క్షీణిస్తుంది. ఈ దశలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడుతాయి. కనుక జ్వరం వచ్చినప్పుడు 2 రోజుల్లోగా తగ్గకపోతే వెంటనే డాక్టర్‌ను కలవాల్సి ఉంటుంది. వీలైనంత త్వరగా కలిస్తే ఇంకా మంచిది.

**బొప్పాయి పండ్లు..**


డెంగీ మాత్రమే కాకుండా విష జ్వరాలు ఏవి వచ్చినా సరే వారికి బొప్పాయి పండ్లు అద్భుతంగా పనిచేస్తాయి. ఈ పండ్లలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. అలాగే అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్లు ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీంతో జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. అలాగే తిన్న ఆహారం సులభంగా జీర్ణమై అందులో ఉండే పోషకాలను శరీరం సులభంగా గ్రహిస్తుంది. దానిమ్మ పండ్లను ఆహారంలో భాగం చేసుకున్నా కూడా ప్లేట్‌లెట్ల సంఖ్య పెరుగుతుంది. ఈ పండ్లలోనూ అనేక పోషకాలు ఉంటాయి. ఇవి ప్లేట్‌లెట్లు ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. ఇన్‌ఫెక్షన్లను తగ్గేలా చేస్తాయి. దీంతో జ్వరం నుంచి కోలుకుంటారు. అలాగే ఆకుపచ్చ రంగులో ఉండే ఆకుకూరలతోపాటు కూరగాయలను కూడా తింటుండాలి. వీటిల్లోని విటమిన్ కె ప్లేట్‌లెట్లు అధికంగా ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. రోగం నుంచి త్వరగా కోలుకునేలా చేస్తుంది.

**వెల్లుల్లి రెబ్బలు..**

ప్లేట్‌లెట్ల సంఖ్య బాగా తగ్గిన వారు ఉదయం పరగడుపునే 2 పచ్చి వెల్లుల్లి రెబ్బలను తినవచ్చు. లేదా 1 టీస్పూన్ వెల్లుల్లి రసం తాగవచ్చు. దీంతోనూ ఫలితం ఉంటుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. బీట్‌రూట్ జ్యూస్ కూడా ఇందుకు అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ ఉదయం ఒక కప్పు బీట్ రూట్ ముక్కలను తినాలి. లేదా బీట్ రూట్ జ్యూస్ తాగాలి. ఇది ప్లేట్‌లెట్లను తయారు చేయడమే కాదు, రక్తం వృద్ధి చెందేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. బీపీని అదుపులో ఉంచుతుంది. రోజూ ఒక క్యారెట్‌ను ఆహారంలో భాగం చేసుకున్నా కూడా ఎంతో మేలు జరుగుతుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచి ఇన్‌ఫెక్షన్లు తగ్గేలా చేస్తుంది. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. అలాగే కంటి చూపు సైతం మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

**కిస్మిస్‌లు..**

కిస్మిస్‌లను రాత్రి పూట నీటిలో నానబెట్టి మరుసటి రోజు ఉదయం తింటుండాలి. వీటిల్లో ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రక్తం వృద్ధి చెందేలా చేస్తాయి. ప్లేట్‌లెట్ల సంఖ్యను పెంచుతాయి. దీంతో జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. ఉత్సాహంగా కూడా మారుతారు. శరీరానికి శక్తి లభిస్తుంది. డ్రై యాప్రికాట్ పండ్లను రోజుకు 2 సార్లు తింటుండాలి. ఇవి కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచి ఇన్‌ఫెక్షన్లను తగ్గేలా చేస్తాయి. ప్లేట్‌లెట్లు పెరిగేలా చేస్తాయి. ఖర్జూరాలను రోజుకు 3 చొప్పున తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. వీటిని తింటుంటే జీర్ణ సమస్యలు సైతం తగ్గిపోతాయి. ప్లేట్‌లెట్లను పెంచడంలో, రక్తం పెరిగేలా చేయడంలో కివి పండ్లు కూడా మేలు చేస్తాయి. నారింజ పండ్లను తింటున్నా, వాటి జ్యూస్‌ను తాగుతున్నా మేలు జరుగుతుంది.



ప్లేట్‌లెట్లు పెరుగుతాయి. ఇలా ఈ ఆహారాలను తీసుకుంటే ప్లేట్‌లెట్లను పెంచుకోవడంతోపాటు డెంగీ వంటి జ్వరాల నుంచి త్వరగా కోలుకుంటారు. ఆరోగ్యంగా ఉంటారు.

# టీ, కాఫీలు తాగేటప్పుడు వీటిని తింటున్నారా..?

## అయితే జాగ్రత్త!



చాలా మంది టీ లేదా కాఫీ తాగేటప్పుడు లేదా తాగడానికి ముందు పలు రకాల స్నాక్స్ తింటుంటారు. వాటిల్లో రస్క్ కూడా ఒకటి. ఈ మధ్య కాలంలో ఇది చాలా పాపులర్ అయింది. ఇంట్లో లేదా బయట ఎక్కడ టీ, కాఫీ తాగినా స్నాక్స్ లాగా రస్క్‌లను తింటున్నారు. అయితే వాస్తవంగా చెప్పాలంటే ఇవి ఆరోగ్యానికి అసలు ఏమాత్రం మంచివి కావని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రస్క్‌లను తినడం వల్ల ఆరోగ్యానికి హాని జరుగుతుందని అంటున్నారు. వీటిని మైదా పిండి, చక్కెర, నూనె, ఈస్ట్, కోడిగుడ్లు, పాల పొడి వంటివి ఉపయోగించి తయారు చేస్తారు. అయితే రస్క్‌లు వాటిని తయారు చేసే విధానం వల్ల వాటిలో వాడే పదార్థాల్లో ఉండే పోషకాలను పూర్తిగా కోల్పోతాయి. ఈ క్రమంలో అలాంటి రస్క్‌లను తింటే తీవ్రమైన నష్టాలు ఉంటాయి.

**బరువు పెరుగుతారు..**

రస్క్‌లలో మైదా అధికంగా ఉంటుంది. ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. మైదాలో ఫైబర్, విటమిన్లు, మినరల్స్ అసలు ఏమాత్రం ఉండవు. అందువల్ల మైదాతో తయారు చేసే రస్క్‌లను తింటే రక్తంలో షుగర్ లెవల్స్ అమాంతం పెరుగుతాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఇది అసలు ఏమాత్రం మంచిది కాదు. డయాబెటిస్ లేని వారికి కూడా రస్క్‌లను తరచూ తింటే డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కనుక వీటిని తినడం మానుకోవాలి. రస్క్‌లలో అధిక మొత్తంలో చక్కెర, హైడ్రోజినేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి హాని చేస్తాయి. అధికంగా బరువు పెరిగేలా చేస్తాయి. దీంతో బీపీ అధికమవుతుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. రస్క్‌లలో ఫైబర్ అసలే ఉండదు. ఇది జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, మలబద్దకం వంటి సమస్యలను కలగజేస్తుంది. రస్క్‌లలో ప్రోటీన్లు కూడా ఉండవు కనుక వీటిని తింటే రోజు మొత్తంలో ఇతర సమయాల్లో ఆకలి ఎక్కువ అవుతుంది. దీంతో ఆహారం అధికంగా తింటారు. ఇది బరువు పెంచేలా చేస్తుంది. కనుక రస్క్‌లకు దూరంగా ఉంటే మంచిది.

**షుగర్ వస్తుంది..**

రస్క్‌లను తరచూ తినే వారికి షుగర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిని తింటే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అధికంగా పెరుగుతాయి. ఆ లెవల్స్‌ను తగ్గించేందుకు క్లోమగ్రంథి అధికంగా ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తూ ఎక్కువగా పనిచేయాల్సి వస్తుంది. దీర్ఘకాలంలో ఇలాగే జరిగితే క్లోమ గ్రంథి ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కోల్పోతుంది. దీంతో షుగర్ లెవల్స్ అధికంగా పెరిగిపోయి డయాబెటిస్ వస్తుంది. అలాగే రక్తంలో ఇన్సులిన్ లెవల్స్ మరీ అధికంగా ఉంటే ఆహారం కొవ్వుగా మారుతుంది. దీన్ని శరీరం నిల్వ చేసుకుంటుంది. దీని వల్ల దీర్ఘకాలంలో ఇన్సులిన్ నిరోధకత ఏర్పడుతుంది. ఇన్సులిన్ ఉత్పత్తి సరిగ్గానే ఉన్నా కొవ్వు కారణంగా శరీరం దాన్ని సరిగ్గా వినియోగించుకోలేదు. దీంతో షుగర్ లెవల్స్ అంతకంతకూ పెరిగిపోతాయి. చివరకు డయాబెటిస్‌కు దారి తీస్తుంది. రస్క్‌లను తినడం వల్ల ఈ ప్రమాదం పెరుగుతుంది కనుక వీటిని తినడం మానేస్తే మంచిది.

**జీర్ణ సమస్యలు వస్తాయి..**

రస్క్‌లలో క్యాలరీలు అధికంగా ఉంటాయి. పిండి పదార్థాలు, చక్కెర. కొవ్వులు అధికంగా ఉంటాయి. కనుక తరచూ వీటిని తింటే శరీరంలో చేరే క్యాలరీలు పెరిగిపోతాయి. కొవ్వు అధికంగా పేరుకుపోతుంది. దీని వల్ల బరువు పెరుగుతారు. రస్క్‌లలో ఫైబర్ ఉండని కారణంగా అవి సులభంగా జీర్ణం కావు. దీని వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. కొందరికి పొట్టలో తరచూ విపరీతమైన అసౌకర్యం ఏర్పడుతుంది. రస్క్‌లను తింటే దీర్ఘకాలంలో క్యాన్సర్ వచ్చే ప్రమాదం సైతం పెరుగుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. రస్క్‌లను తినడం వల్ల పోషకాహార లోపం సంభవించే అవకాశాలు కూడా ఉంటాయని చెబుతున్నారు. కనుక వీటిని తినడం పూర్తిగా మానేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చు. ఎలాంటి రోగాలు రాకుండా ఉంటాయి.

# పెసర మొలకలను ఇలా తయారు చేయండి

## రోజూ తింటే ఎన్నో లాభాలు



ఆరోగ్యం కోసం మొలకలను రోజూ తినాలని పోషకాహార నిపుణులు, వైద్యులు తరచూ చెబుతుంటారు. మొలకలను తింటే అనేక పోషకాలు లభించడమే కాక, పలు వ్యాధులను సైతం నయం చేస్తాయి. ఈ క్రమంలోనే మొలకల్లోనే పెసర మొలకలు చాలా ముఖ్యమైనవని చెప్పవచ్చు. వీటిని త్వరగా మొలకలుగా తయారు చేయవచ్చు. రుచిగా కూడా ఉంటాయి. మొలకలను తయారు చేసేందుకు గాను 1 కప్పు పెసలను ముందుగా తీసుకోవాలి. వీటిని శుభ్రంగా కడిగిన తరువాత ఒక పాత్ర తీసుకుని అందులో నీళ్లను పోసి దాంట్లో పెసలను మునిగేలా వేయాలి. అనంతరం ఆ పెసలను కనీసం 8 నుంచి 12 గంటల పాటు నీటిలో నానబెట్టాలి. లేదా రాత్రంతా నానబెట్టాల్సి ఉంటుంది. అలా నానిన పెసలను తీసి ఒక శుభ్రమైన వస్త్రంలో వేసి ముడిలా కట్టాలి. అనంతరం ఆ పెసలను వెచ్చని ప్రదేశంలో ఉంచాలి. 24 గంటల తరువాత ఆ పెసలకు మొలకలు వస్తాయి.

**ఇలా చేయాలి..**

అలా మొలకలు వచ్చిన తరువాత పెసలను తీసి బాగా కడిగి తినాలి. నేరుగా తినలేమని అనుకుంటే వాటిని పెనంపై నెయ్యితో కాస్త వేయించి తినాలి. లేదా సలాడ్‌లా తయారు చేసుకుని కూడా తినవచ్చు. ఈ పెసలను సాయంత్రం సమయంలో స్నాక్స్‌లా తింటే ఎంతో రుచిగా ఉండడమే కాదు, రాత్రి పూట ఆహారం ఎక్కువగా తినకుండా ఉంటారు. దీంతో బరువు తగ్గడం సులభతరం అవుతుంది. పెసలను ఇలా ఎప్పటికప్పుడు తయారు చేసుకుని రోజుకు ఒక కప్పు మోతాదులో తినవచ్చు. లేదా ఒకసారి తయారు చేసి ఫ్రిజ్‌లో పెట్టి 2 లేదా 3 రోజుల వరకు రోజూ తినవచ్చు. ఇలా పెసలను తింటుంటే అనేక లాభాలు కలుగుతాయి.

**జీర్ణ వ్యవస్థకు..**

పెసలలో సంక్లిష్టమైన కార్బొహైడ్రేట్లు ఉంటాయి. ఇవి నెమ్మదిగా జీర్ణం అవుతాయి. అంతేకాదు, పెసలలో ఉండే పోషకాలను శరీరం సులభంగా శోషించుకోవాలంటే వాటిని మనం మొలకల రూపంలో తినాలి. దీంతో అనేక పోషకాలు లభిస్తాయి. పెసర మొలకలను ఉదయం లేదా సాయంత్రం తినవచ్చు. రాత్రి పూట తినకూడదు. తింటే గ్యాస్ సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి. మొలకలను తినడం వల్ల ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్దకం తగ్గేలా చేస్తుంది. పెసలలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. కనుక నాన్ వెజ్ తినని వారికి ఇవి ఉత్తమ ఆహారంగా పనిచేస్తాయి. మొలకలను తింటే ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి కండరాలకు మరమ్మత్తులు చేసి శక్తిని అందిస్తాయి. కండరాల అభివృద్ధికి దోహదం చేస్తాయి. దీని వల్ల కండరాల నొప్పులు సైతం తగ్గిపోతాయి.

**బరువు తగ్గేందుకు..**

పెసర మొలకల్లో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్లు సి, ఎ అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులు తగ్గిపోతాయి. పెసలను తినడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. పెసర మొలకలను తింటుంటే షుగర్ లెవల్స్ సైతం నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఇవి మేలు చేస్తాయి. కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారు మొలకలను రోజూ తింటుంటే కొద్ది రోజులకు కొలెస్ట్రాల్ పూర్తిగా నియంత్రణలో ఉంటుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా నివారించవచ్చు. ఇలా మొలకలను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# కిస్మిస్‌లను అసలు రోజూ ఎన్ని తినాలి?

## ఎలా తింటే మంచిదంటే..



మనకు తినేందుకు అనేక రకాల డ్రై ఫ్రూట్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో కిస్మిస్‌లు కూడా ఒకటి. వీటినే ఎండు ద్రాక్ష అని కూడా పిలుస్తారు. వీటిని మనం స్వీట్ల తయారీలో ఉపయోగిస్తుంటాం. ఇవి ఎంతో రుచిగా ఉండడమే కాదు, అనేక పోషకాలను అందిస్తాయి. అయితే కిస్మిస్‌లను రోజూ నీటిలో నానబెట్టి తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు, వైద్యులు చెబుతున్నారు. కానీ కిస్మిస్‌లను అసలు రోజుకు ఎన్ని తినాలి.. అనే సందేహం వస్తుంటుంది. ఇందుకు వారు ఏమని సమాధానం చెబుతున్నారంటే.. కిస్మిస్‌లను పెద్దలు అయితే రోజుకు 50 గ్రాముల వరకు తినవచ్చు. నీటిలో నానబెట్టి తింటే పోషకాలు శరీరానికి సరిగ్గా లభిస్తాయి. పిల్లలకు అయితే 20 గ్రాముల మేర కిస్మిస్‌లను రోజూ నీటిలో నానబెట్టి తినిపించవచ్చు. దీంతో సులభంగా జీర్ణమవుతాయి.

**కొలెస్ట్రాల్ స్థాయిలకు..**

కిస్మిస్‌లను తినడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. పలు వ్యాధులను నయం చేసుకోవచ్చు. వీటిల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. అందువల్ల కిస్మిస్‌లను తింటే పేగుల్లో మలం కదలికలు సాఫీగా జరుగుతాయి. దీంతో మలబద్దకం తగ్గిపోతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. రాత్రి పూట కిస్మిస్‌లను నానబెట్టి మరుసటి రోజు ఉదయం తింటే శరీరం చాలా వరకు పోషకాలను సులభంగా గ్రహిస్తుంది. అలాగే సులభంగా జీర్ణమవుతాయి కూడా. కిస్మిస్‌లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటు నియంత్రించేందుకు సహాయం చేస్తుంది. వీటిల్లో పాలిఫినాల్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉన్న చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతాయి. దీంతో గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.

**శక్తికి, ఉత్తేజానికి..**

కిస్మిస్‌లను రాత్రి పూట నీటిలో నానబెట్టి వాటిని ఉదయం తింటే శరీరానికి తక్షణమే శక్తి లభిస్తుంది. బద్ధకం పోతుంది. యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. రోజంతా శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. నీరసం, అలసట ఉండవు. ఎంత పనిచేసినా చురుగ్గానే ఉంటారు. కిస్మిస్‌లలో పిండి పదార్థాలు, గ్లూకోజ్, ఫ్రక్టోజ్ అనే సహజసిద్ధమైన చక్కెరలు ఉంటాయి. ఇవి తక్షణ శక్తిని అందించి ఉత్సాహంగా ఉండేలా చేస్తాయి. కిస్మిస్‌లలో ఫినాల్స్, పాలిఫినాల్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండడం కారణంగా ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. శరీరంలో అంతర్గతంగా వచ్చే వాపులను తగ్గిస్తాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**ఎముకల దృఢత్వానికి..**

కిస్మిస్‌లలో ఎముకల ఆరోగ్యానికి అవసరం అయిన అనేక పోషకాలు ఉంటాయి. క్యాల్షియం, మెగ్నిషియం, బోరాన్ అధికంగా ఉంటాయి. బోరాన్ వల్ల కిస్మిస్‌లలో ఉండే క్యాల్షియం, మెగ్నిషియంలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. వృద్ధాప్యంలో ఆర్థరైటిస్, ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. కిస్మిస్‌లలో ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. రక్తం తక్కువగా ఉన్నవారు సాధారణ కిస్మిస్‌లకు బదులుగా నలుపు రంగులో ఉండే కిస్మిస్‌లను నానబెట్టి తింటే ఇంకా ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. ఇలా కిస్మిస్‌లను రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.



# మూడో వన్డేలో ఆఫ్ఘన్ తొలుత బ్యాటింగ్

**చెన్నై, జూన్ 20:** భారత్–ఆఫ్ఘనిస్తాన్ మధ్య జరుగుతున్న మూడో వన్డేలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఇప్పటికే తొలి రెండు వన్డేల్లో విజయం సాధించిన భారత జట్టు సిరీస్‌ను కైవసం చేసుకుంది. చివరి వన్డేలోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలనే లక్ష్యంతో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు బరిలోకి దిగింది. ఈ మ్యాచ్ కోసం భారత జట్టులో మూడు మార్పులు చేశారు. ప్రసిద్ధ్ కృష్ణ, హర్ష్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డికి తుది జట్టులో అవకాశం కల్పించారు. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టు కూడా నాలుగు మార్పులతో బరిలోకి దిగింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైన ఆ జట్టు, చివరి వన్డేలో గెలిచి పరువు నిలబెట్టుకోవాలని భావిస్తోంది. చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు పోటాపోటీగా రాణించేందుకు సిద్ధమయ్యాయి. భారత జట్టు క్లీన్‌స్వీప్‌పై దృష్టి పెట్టగా, ఆఫ్ఘనిస్తాన్ గెలుపుతో సిరీస్‌ను ముగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



# మెస్సీ హ్యాట్రిక్‌తో అర్జెంటీనా ఘనవిజయం

## ఫిఫా వరల్డ్ కప్‌లో అల్జీరియా ఫిర్యాదుతో హాట్ హాట్ వివాదం

**న్యూఢిల్లీ, జూన్ 20 :** ప్రపంచ క్రీడా రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఫిఫా వరల్డ్ కప్ ప్రారంభ దశలోనే సంచలన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఒకవైపు రికార్డుల వర్షం కురుస్తుండగా, మరోవైపు అనూహ్య వివాదాలు ఫుట్‌బాల్ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. తాజాగా అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సీ హ్యాట్రిక్ గోల్స్‌తో అదరగొట్టిన మ్యాచ్ తర్వాత, ఓడిపోయిన అల్జీరియా జట్టు ఫిఫాకు అధికారిక ఫిర్యాదు చేయడం ఇప్పుడు అంతర్జాతీయ క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గ్రూప్ స్టేజ్ తొలి మ్యాచ్‌లో అర్జెంటీనా జట్టు 3–0 తేడాతో అల్జీరియాపై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ మ్యాచ్‌లో మెస్సీ మూడు అద్భుత గోల్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. అయితే ఈ పరాజయాన్ని జీర్ణించుకోలేని అల్జీరియా ఫుట్‌బాల్ సమాఖ్య, మ్యాచ్ అనంతరం ఫిఫాకు అధికారికంగా కంప్లైంట్ చేసింది. మ్యాచ్ సమయంలో మెస్సీ చేసిన ఒక చర్యపై రిఫరీ సరైన నిర్ణయం తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. అల్జీరియా ఆరోపణల ప్రకారం, ఒక సందర్భంలో మెస్సీ కాలు తమ జట్టు కెప్టెన్‌పై బలంగా తాకినప్పటికీ రిఫరీ దానిని తీవ్రమైన ఫౌల్‌గా పరిగణించలేదని, రెడ్ కార్డ్ ఇవ్వాల్సిన పరిస్థితిని కూడా పట్టించుకోలేదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా అర్జెంటీనా మిడ్‌ఫీల్డర్ అలెక్సిస్ మెక్ అలిస్టర్ తమ ఆటగాడిని మోచేతితో తోసిన ఘటనను కూడా రిఫరీ పట్టించుకోలేదని అల్జీరియా ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మ్యాచ్‌కు పోలాండ్‌కు చెందిన ప్రముఖ రిఫరీ షిమోన్ మార్సినియాక్ బాధ్యతలు నిర్వహించడం కూడా ఇప్పుడు వివాదానికి మరింత ఆజ్యం పోస్తోంది. 2022 వరల్డ్ కప్ ఫైనల్‌లో కూడా అర్జెంటీనా జట్టుకు సంబంధించిన మ్యాచ్‌కే ఆయన రిఫరీగా వ్యవహరించిన విషయం గుర్తు చేస్తూ, అల్జీరియా పక్షం ఆయన నిర్ణయాలపై పక్షపాత ఆరోపణలు చేస్తోంది. సోషల్ మీడియా వేదికగా కూడా ఈ అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.మొత్తానికి, మెస్సీ అద్భుత ప్రదర్శనతో అర్జెంటీనా విజయాన్ని అందుకున్నప్పటికీ, మ్యాచ్ అనంతర ఫిర్యాదుతో వరల్డ్ కప్ వేదికపై కొత్త వివాదానికి తెరలేచింది. ఫిఫా ఈ ఆరోపణలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు క్రీడా ప్రపంచం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# భారత్-ఐర్లాండ్ మ్యాచ్‌ల సమయం ముందుకు..

- సూర్యవంశీ క్రేజ్ ప్రభావమేనా?
- రాత్రి 7.30కు బదులు సాయంత్రం 6 గంటలకు మ్యాచ్‌లు?
- యువ సంచలనం వైభవ్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి





**న్యూఢిల్లీ, జూన్ 20 :** భారత క్రికెట్ జట్టు ఐర్లాండ్ పర్యటనకు సిద్ధమవుతున్న వేళ, రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు సంబంధించి మ్యాచ్‌ల సమయాల్లో మార్పు చోటుచేసుకున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. బెల్ఫాస్ట్ వేదికగా జూన్ 26, 28 తేదీల్లో జరగనున్న టీ20 మ్యాచ్‌లను ముందుగా ప్రకటించిన సమయాల కంటే గంటన్నర ముందుగా నిర్వహించాలనే ఆలోచనపై చర్చ జరుగుతోంది. అయితే అధికారిక షెడ్యూల్ ప్రకారం రెండు మ్యాచ్‌లు స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు, భారత కాలమానం ప్రకారం రాత్రి 7.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. క్రికెట్ వర్గాల్లో మాత్రం ఈ సమయ మార్పు వెనుక భారత ప్రేక్షకుల వీక్షణను పెంచాలనే ఉద్దేశమే ప్రధాన కారణమని చర్చ సాగుతోంది. ముఖ్యంగా యువ ప్రేక్షకులను ఆకర్షించేందుకు ప్రసార సంస్థలు, నిర్వాహకులు ప్రత్యేక వ్యూహాలు అమలు చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### వైభవ్ సూర్యవంశీ చుట్టూ పెరుగుతున్న క్రేజ్

ఈ చర్చలన్నింటికీ కేంద్రబిందువుగా నిలుస్తున్న పేరు యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ. కేవలం 15 ఏళ్ల వయసులో భారత జట్టులో చోటు దక్కించుకున్న అతడు అంతర్జాతీయ అరంగేట్రానికి సిద్ధమవుతుండటంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఐపీఎల్‌లో తన దూకుడు ఆటతో గుర్తింపు పొందిన సూర్యవంశీని ప్రత్యక్షంగా చూడాలని యువత, విద్యార్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అతని ఎంపికతో ఐర్లాండ్ సిరీస్‌పై అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆసక్తి పెరిగినట్లు కనిపిస్తోంది. టికెట్లకు మంచి డిమాండ్ ఉందని అభిమానుల చర్చల్లో కూడా కనిపిస్తోంది. సూర్యవంశీపై అంచనాలు పెరుగుతున్నప్పటికీ, ఇటీవల అతని ఫామ్ మాత్రం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కొన్ని మ్యాచ్‌ల్లో ఆశించిన స్థాయిలో పరుగులు చేయకపోవడంతో అతడు మళ్లీ తన సహజ ఆటను ప్రదర్శించగలడా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే అతని ప్రతిభపై సెలెక్టర్లు, బీసీసీఐ విశ్వాసం కొనసాగిస్తున్నాయి. అతని వయసును దృష్టిలో ఉంచుకుని ఒత్తిడి తగ్గించే చర్యలు కూడా బోర్డు తీసుకుంటోందని సమాచారం. యువ ఆటగాడి మానసిక స్థితి, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

### అందరి చూపు బెల్ఫాస్ట్‌పైనే

భారత్–ఐర్లాండ్ సిరీస్ సాధారణ ద్వైపాక్షిక సిరీస్‌గా కాకుండా, భారత క్రికెట్‌లో కొత్త తరం ఆరంభానికి సంకేతంగా మారింది. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో భారత జట్టు బరిలోకి దిగుతుండగా, వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం జరిగే అవకాశంపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మ్యాచ్‌ల సమయ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉన్నప్పటికీ, ఈ సిరీస్ చుట్టూ ఏర్పడిన ఉత్కంఠకు యువ సంచలనం సూర్యవంశీ ప్రధాన కారణంగా నిలుస్తున్నాడనడంలో సందేహం లేదు. ఇప్పుడు అందరి చూపు బెల్ఫాస్ట్‌పైనే ఉంది. అభిమానుల అంచనాలను అతడు అందుకుంటాడా? లేక అంతర్జాతీయ ఒత్తిడిలో తడబడతాడా? అన్నది ఈ సిరీస్‌లో తేలనుంది.

# హార్దిక్ పాండ్యా గాయం.. టీమిండియాకు షాక్

## ఇంగ్లండ్ వన్డే సిరీస్‌తో పాటు ఆసియా క్రీడలకు కూడా దూరం

**న్యూఢిల్లీ, జూన్ 20 :** టీమిండియాకు మరోసారి గాయాల రూపంలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వచ్చే నెలలో ఇంగ్లండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో శిక్షణ పొందుతున్న సమయంలో అతడి తొడ కండరానికి గాయం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గాయం తీవ్రత కారణంగా కోలుకోవడానికి అనుకున్నదానికంటే ఎక్కువ సమయం పడుతుందని వైద్య బృందం అంచనా వేసింది. దీంతో హార్దిక్ పాండ్యా ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌లకు మాత్రమే కాకుండా సెప్టెంబర్‌లో జరిగే ఆసియా క్రీడల జట్టులోనూ సెలెక్టర్లు అతడిని పరిగణనలోకి తీసుకోలేదు. ఈ పరిణామం 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని అతడి వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగానే తీసుకున్న నిర్ణయమని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం పాండ్యా బౌలింగ్ చేయడానికి పూర్తిగా ఫిట్‌గా లేదని సమాచారం. ఈ నేపథ్యంలో అతడికి పూర్తి విశ్రాంతి ఇచ్చి, పూర్తిగా కోలుకున్న తర్వాతే తిరిగి జట్టులోకి తీసుకురావాలని బోర్డు భావిస్తోంది. ఇదిలా ఉండగా, మరో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌పై కూడా అనిశ్చితి కొనసాగుతోంది. ఐపీఎల్ ఫైనల్ సమయంలో కండరాల నొప్పితో బాధపడిన కోహ్లీ ప్రస్తుతం లండన్‌లో చికిత్స తీసుకుంటూ కోలుకుంటున్నాడు. ఇంగ్లండ్ టూర్‌కు అతను అందుబాటులో ఉంటాడా లేదా అన్నది జూన్ 22న జరిగే ఫిట్‌నెస్ టెస్ట్ తర్వాతే స్పష్టమవుతుందని బీసీసీఐ తెలిపింది. ఆఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న ప్రస్తుత వన్డే సిరీస్‌కు కూడా కోహ్లీ దూరంగా ఉన్నాడు. ఫిట్‌నెస్ పరీక్షలో పాస్ అయితేనే అతడు జూలైలో జరిగే ఇంగ్లండ్ వన్డే సిరీస్‌కు ఎంపిక కానున్నాడు. సీనియర్ ఆటగాళ్ల గాయాల సమస్యలు గిల్ నాయకత్వంలోని యువ టీమిండియాకు కొత్త సవాలుగా మారుతున్నాయి.



# విదేశీ ప్లేయర్లపై గావస్కర్ ఆగ్రహం

**న్యూఢిల్లీ, జూన్ 20 :** ఐపీఎల్ టోర్నమెంట్‌ను తేలికగా తీసుకుంటున్న కొంతమంది విదేశీ క్రికెటర్ల తీరుపై టీమిండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బీసీసీఐ ఎన్ని నిబంధనలు తీసుకొచ్చినా, కొంతమంది ఆటగాళ్లు ఏదో ఒక కారణం చూపుతూ టోర్నీ మధ్యలోనే జట్టును వీడుతున్నారని ఆయన విమర్శించారు. జట్టులో అవకాశాలు లభించకపోతే గాయాల సాకుతో స్వదేశానికి వెళ్లి అక్కడి స్థానిక టోర్నీల్లో పాల్గొంటున్నారని గావస్కర్ ఆరోపించారు. ఇలాంటి తీరును నియంత్రించడానికి బీసీసీఐ మరింత కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం, వేలంలో కొనుగోలు చేసిన తర్వాత అందుబాటులో లేకపోతే ప్లేయర్లపై రెండేళ్ల నిషేధం విధిస్తున్నారని గుర్తుచేసిన గావస్కర్, అదే విధంగా టోర్నీ మధ్యలో జట్టును వీడే విదేశీ ఆటగాళ్లపైనా కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే మ్యాచ్ ఫీజుల్లో కోత విధించడంతో పాటు, అవసరమైతే కాంట్రాక్టులను రద్దు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఐపీఎల్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీకి పూర్తిగా నిబద్ధత చూపడం ప్రతి ఆటగాడి బాధ్యత అని గావస్కర్ స్పష్టం చేశారు. ఫ్రాంచైజీలు భారీ మొత్తాలు పెట్టుబడి పెడుతున్న సమయంలో ఆటగాళ్లు పూర్తి సీజన్‌కు అందుబాటులో ఉండకపోవడం అన్యాయమని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే ప్లేయర్ ఫీజులో కొంత భాగం విదేశీ బోర్డులకు వెళ్తున్న నేపథ్యంలో, టోర్నీకి మధ్యలో దూరమయ్యే ఆటగాళ్లపై ఆర్థికపరమైన చర్యలు కూడా అవసరమని ఆయన సూచించారు. ఐపీఎల్ ప్రపంచంలోనే అత్యుత్తమ టీ20 లీగ్‌గా నిలిచిందని, దీనిని గౌరవించడం ప్రతి క్రికెటర్ బాధ్యత అని గావస్కర్ పేర్కొన్నారు.



# ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌కు ముందు విరాట్ కోహ్లీకి కీలక ఫిట్‌నెస్ టెస్ట్

**న్యూఢిల్లీ, జూన్ 20:** భారత క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్‌పై అనిశ్చితి కొనసాగుతోంది. త్వరలో జరగనున్న ఇంగ్లండ్ పర్యటనలోని వన్డే సిరీస్‌కు ముందు అతడి లభ్యతపై సందిగ్ధత నెలకొంది. దీంతో కోహ్లీకి సంబంధించిన ఫిట్‌నెస్ పరీక్ష ఇప్పుడు కీలకంగా మారింది. ఐపీఎల్ 2026 ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున 75 పరుగుల మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ, అదే మ్యాచ్‌లో తొడ కండరాల గాయానికి గురయ్యాడు. ఆ తర్వాత నుంచి ఆయన లండన్‌లో పునరావాసం పొందుతూ కోలుకుంటున్నాడు. తాజాగా కోహ్లీ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో ఫిట్‌నెస్ అసెస్‌మెంట్‌కు హాజరుకానున్నాడని సమాచారం. ఫిట్‌నెస్ నివేదికలు అనుకూలంగా వస్తేనే ఇంగ్లండ్ వన్డే సిరీస్‌కు అతడిని ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సమావేశమై జట్టును ప్రకటించనుంది. సెలెక్టర్లు కోహ్లీ ఫిట్‌నెస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారని సమాచారం. ఇదిలా ఉండగా, జూలై 14 నుంచి 19 వరకు బర్మింగ్‌హామ్, కార్డిఫ్, లార్డ్స్ వేదికలపై ఈ కీలక వన్డే సిరీస్ జరగనుంది. కోహ్లీ అందుబాటులో ఉంటాడా లేదా అన్నది పూర్తిగా అతని ఫిట్‌నెస్ రిపోర్టులపైనే ఆధారపడి ఉందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి.






# 'మా ఇంటి బంగారం'కు బలమైన వసూళ్లు

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతోంది. జూన్ 19న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తొలి ప్రదర్శన నుంచే సానుకూల స్పందనను సొంతం చేసుకుంది. కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ ఘట్టాలు, సమంత నటన ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమా తొలి రెండు రోజుల్లోనే గట్టి వసూళ్లు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాల అంచనాలు చెబుతున్నాయి. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.13.15 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించిన ఈ చిత్రం, రెండో రోజు కూడా అదే జోరును కొనసాగించినట్లు సమాచారం. ట్రేడ్ లెక్కల ప్రకారం రెండో రోజు ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.15 కోట్ల వరకు గ్రాస్ వసూళ్లు వచ్చాయని అంచనా. దీంతో కేవలం రెండు రోజుల్లోనే 'మా ఇంటి బంగారం' ప్రపంచవ్యాప్తంగా రూ.25 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు అందుకున్నట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. దేశీయ మార్కెట్‌లోనూ సినిమా బలమైన ప్రదర్శన కనబరుస్తోంది. తొలి రోజు దేశవ్యాప్తంగా రూ.5.35 కోట్ల నెట్ వసూళ్లు నమోదు చేసిన ఈ చిత్రం, రెండో రోజు మరింత పెరుగుదల సాధించి రూ.7.50 కోట్ల నెట్ వరకు చేరినట్లు బాక్సాఫీస్ అంచనాలు సూచిస్తున్నాయి. ఈ లెక్కల ప్రకారం రెండు రోజుల్లో దేశవ్యాప్తంగా రూ.12.85 కోట్ల నెట్ వసూళ్లు నమోదైనట్లు తెలుస్తోంది. శనివారం వసూళ్లలో కనిపించిన పెరుగుదలతో ఆదివారం కలెక్షన్లు మరింత బలపడే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. విదేశీ మార్కెట్‌లో కూడా 'మా ఇంటి బంగారం'కు మంచి స్పందన లభిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌లో ఈ చిత్రం బలమైన వసూళ్లు సాధిస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వీకెండ్ ముగిసే నాటికి ఒక మిలియన్ డాలర్ల మైలురాయిని అందుకునే అవకాశాలు ఉన్నాయని అంచనాలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే సమంత కెరీర్‌లో మరో విశేషమైన మైలురాయి చేరినట్లవుతుంది. ఇప్పటికే విదేశీ మార్కెట్‌లో సమంతకు ఉన్న బలమైన ఆదరణను ఈ చిత్రం మరోసారి రుజువు చేస్తున్నట్లు సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాకు వస్తున్న స్పందనకు టికెట్ బుకింగ్స్ కూడా నిదర్శనంగా నిలుస్తున్నాయి. మంచి మాట వినిపించడంతో కుటుంబ ప్రేక్షకులు కూడా థియేటర్లవైపు మొగ్గుచూపుతున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా 'మా ఇంటి బంగారం'లో సమంత పోషించిన స్వర్ణ పాత్రకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు సమాచారం. మధ్యతరగతి కుటుంబానికి చెందిన మహిళగా ఒకవైపు సహజమైన భావోద్వేగాలను పండిస్తూ, మరోవైపు మాస్ యాక్షన్ సన్నివేశాల్లో దూకుడుగా కనిపించిన సమంత నటనకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఈ చిత్రం సమంత కెరీర్‌లో అత్యుత్తమ ఆరంభం నమోదు చేసిన చిత్రాల్లో ఒకటిగా నిలుస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# సప్తమి గౌడపై ఆసక్తికర విషయాలు వైరల్

ఒకే ఒక్క సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న ముద్దుగుమ్మ సప్తమి గౌడ ప్రస్తుతం మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు. రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార' చిత్రంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆమె, ఆ తర్వాత వరుస ప్రాజెక్ట్‌లతో తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లారు. 'కాంతార' సినిమాతో డీ గ్లామర్ పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న సప్తమి గౌడ, ఆ చిత్ర విజయంతో ఒక్కసారిగా పాన్ ఇండియా గుర్తింపు పొందారు. ఈ సినిమా అన్ని భాషల్లో విజయవంతం కావడంతో ఆమె పేరు దేశవ్యాప్తంగా మారుమ్రోగింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో వచ్చిన 'ది వ్యాక్సిన్ వార్' చిత్రంలో కూడా నటించి మంచి గుర్తింపు పొందారు. తెలుగు చిత్ర పరిశ్రమలో నితిన్ హీరోగా వచ్చిన 'తమ్ముడు' సినిమాతో సప్తమి గౌడ కథానాయికగా అడుగుపెట్టారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమెకు టాలీవుడ్‌లో అవకాశాలు తగ్గినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రస్తుతం ఆమె ఎక్కువగా కన్నడ చిత్ర పరిశ్రమపైనే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇక సోషల్ మీడియాలో మాత్రం సప్తమి గౌడ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉన్నారు. ఒకే ఒక్క సినిమాతో వచ్చిన భారీ క్రేజ్ తర్వాత ఆమె తదుపరి ప్రాజెక్ట్‌లపై ప్రేక్షకుల్లో ఆసక్తి కొనసాగుతోంది. త్వరలో ఆమె నుంచి మరిన్ని కొత్త సినిమాల ప్రకటనలు వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.






# 'బాహుబలి' డాక్యుసిరీస్‌కు విడుదల తేదీ

ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ఖ్యాతిని మరింత ఎత్తుకు తీసుకెళ్లిన 'బాహుబలి' ఫ్రాంచైజీకి సంబంధించి మరో ఆసక్తికర అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. 'బాహుబలి: ది టార్చ్ బేరర్' పేరుతో రూపొందిన డాక్యుసిరీస్ ఈ నెల 26 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారం కానున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 'బాహుబలి' రెండు భాగాల విజయంతో తెలుగు సినిమా అంతర్జాతీయ వేదికపై ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నేపథ్యంలో, ఇప్పుడు ఆ మహా ప్రయాణం వెనుక కథలను ఈ డాక్యుసిరీస్ రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇది సాధారణ సినిమా కాకుండా, 'బాహుబలి' రూపుదిద్దుకున్న తీరు, ఆ ఫ్రాంచైజీ వెనుక ఉన్న కఠిన శ్రమ, సృజనాత్మక దృష్టి, సాంకేతిక విస్తృతి, ప్రపంచవ్యాప్తంగా దక్కిన స్పందన వంటి అంశాలను ప్రతిబింబించే డాక్యుసిరీస్‌గా రూపొందినట్లు సమాచారం. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ఆలోచన ఎలా ఆవిర్భవించింది, ప్రభాస్, రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ వంటి తారలు తమ పాత్రల కోసం ఎలా సిద్ధమయ్యారు, వేలాది మంది సాంకేతిక నిపుణులు ఈ మహా ప్రాజెక్ట్ కోసం ఎంతటి కృషి చేశారు వంటి విశేషాలను ఇందులో చూపించనున్నారు. ముఖ్యంగా యుద్ధ సన్నివేశాల రూపకల్పన, దృశ్య ప్రభావాల పనితీరు, చిత్రీకరణలో ఎదురైన సవాళ్లు వంటి తెరవెనుక విషయాలు అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే అవకాశముంది. అంతేకాదు, 'బాహుబలి' విడుదలైన తర్వాత దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా వచ్చిన స్పందన, బాక్సాఫీస్ రికార్డులు, సాంస్కృతిక ప్రభావం, తెలుగు సినిమాపై ఏర్పడిన కొత్త దృష్టికోణం వంటి అంశాలకూ ఈ డాక్యుసిరీస్‌లో ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒక ప్రాంతీయ చిత్రంగా ప్రారంభమైన 'బాహుబలి' ఎలా విశ్వవ్యాప్త చర్చకు దారి తీసిందో, భారతీయ సినిమా పరిధిని ఎలా విస్తరించిందో ఈ రూపంలో మళ్లీ చూపించబోతున్నారు. అందుకే ఈ ప్రకటనతో ప్రభాస్, రాజమౌళి అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఇక మరోవైపు 'బాహుబలి: ది ఎపిక్' కలిపిన రూపం గురించి కూడా అభిమానుల్లో చర్చ నడుస్తోంది. అయితే ఆ సంయుక్త సంచికకు సంబంధించిన అన్ని భాషల ప్రసారంపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం మాత్రం 'బాహుబలి: ది టార్చ్ బేరర్'పై అందరి దృష్టి నిలిచింది. సినిమా కాకపోయినా, సినిమా వెనుక ఉన్న మహా ప్రయాణాన్ని ఆవిష్కరించే ఈ డాక్యుసిరీస్ అభిమానులకు కొత్త అనుభూతిని అందించే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# నిర్మాత గొట్టిముక్కల పద్మారావు మృతి



తెలుగు చలనచిత్ర పరిశ్రమతో పాటు రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ సినీ నిర్మాత, రాజకీయ నాయకుడు గొట్టిముక్కల పద్మారావు (72) ఆదివారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్ కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణవార్త తెలియగానే కూకట్‌పల్లిలోని నివాసానికి సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, స్థానిక రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకుని నివాళులర్పించారు. పద్మారావు మృతి పట్ల సినీ, రాజకీయ రంగాల ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. గొట్టిముక్కల పద్మారావు తెలుగు సినీ పరిశ్రమలో నిర్మాతగా తనదైన ముద్ర వేశారు. ఆయన స్థాపించిన 'పద్మప్రియ ఆర్ట్స్' బ్యానర్ ద్వారా విభిన్న కథాంశాలతో పలు విజయవంతమైన చిత్రాలను ప్రేక్షకులకు అందించారు. సుమన్ హీరోగా తెరకెక్కిన 'కంచు కవచం' వంటి యాక్షన్ చిత్రంతో పాటు, రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో రూపొందిన వినోదాత్మక చిత్రం 'జోకర్'ను కూడా నిర్మించారు. అంతేకాకుండా తెలుగు ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయిన క్లాసిక్ కామెడీ చిత్రం 'ఏప్రిల్ 1 విడుదల' వంటి విజయవంతమైన సినిమాలను నిర్మించి ఆయన ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. వైవిధ్యమైన కథలను ప్రోత్సహిస్తూ, కొత్త ఆలోచనలతో సినిమాలను నిర్మించిన పద్మారావు, పరిశ్రమలో అందరితో సాన్నిహిత్యంగా మెలిగే వ్యక్తిగా పేరొందారు. సినిమా రంగంలోనే కాకుండా ప్రజా సేవలోనూ చురుకుగా పాల్గొంటూ సమాజానికి తనవంతు సేవ చేసిన ఆయన మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటని సినీ ప్రముఖులు పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ అభిమానులు, పరిశ్రమ వర్గాలు సోషల్ మీడియాలో సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# ధనుష్-మృణాల్‌పై కొత్త ప్రచారం





కోలీవుడ్ నటుడు ధనుష్, బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందంటూ గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. పలుమార్లు ఇద్దరూ కలిసి కనిపించడం, ఒకరి కుటుంబ సభ్యులతో మరొకరు సన్నిహితంగా మెలగడం వంటి అంశాలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చాయి. అయితే తాజాగా ఈ ఇద్దరూ దూరమయ్యారంటూ సినీ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. దీంతో ధనుష్, మృణాల్ సంబంధంపై మరోసారి ఆసక్తికరమైన ప్రచారం తెరపైకి వచ్చింది. మృణాల్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో ధనుష్ సోదరీమణులు కార్తీక, విమలా గీతలను అనుసరిస్తుండటమూ ఈ వార్తలకు మరింత ఊతమిచ్చింది. దీంతో ఇద్దరూ ప్రేమలో ఉన్నారనీ, త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనీ కథనాలు వినిపించాయి. ఈ ప్రచారంపై ధనుష్ ఎప్పుడూ నేరుగా స్పందించలేదు. అయితే మృణాల్ మాత్రం గతంలో ధనుష్ తనకు మంచి స్నేహితుడు మాత్రమేనని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఆ వ్యాఖ్యలతోనూ పుకార్లకు పూర్తిగా తెరపడలేదు. ఈ ప్రచారంపై ఇప్పటి వరకు అటు ధనుష్ గానీ, ఇటు మృణాల్ గానీ అధికారికంగా స్పందించలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందన్నది ఇంకా స్పష్టతకు రాలేదు.




# ఓటిటిలోకి అర్జున్ 'బ్లాస్ట్' మూవీ

చాలా రోజుల తర్వాత అర్జున్ తన యాక్షన్‌తో మెప్పించిన చిత్రం 'బ్లాస్ట్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా జూన్ 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా వెల్లడించింది. కొన్ని రోజులుగా దీని ఓటీటీ తేదీపై వార్తలు వస్తున్నప్పటికీ నేడు నెట్‌ఫ్లిక్స్ అధికారిక తేదీని వెల్లడించింది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రీతీ ముకుందన్, అభిరామి, అర్జున్ చిదంబరం తదితరులు నటించారు. అర్జున్‌ని ఈ తరహా యాక్షన్ పాత్రలో చూసి చాలా కాలమైంది. సగటు మధ్యతరగతి తండ్రిలా కనిపిస్తూనే.. కుటుంబానికి సమస్య ఎదురైనప్పుడు ఎంతదాకైనా పోరాడే వ్యక్తిగా ఆద్యంతం అలరించారు. కూతుర్ని వీరనారిలా పెంచాలనే అతని వ్యక్తిత్వం అందరినీ ఆలోచింపజేస్తుంది. యాక్షన్ ప్రాధాన్యమున్న నీల పాత్రలో ప్రీతి ముకుందన్ ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రొఫెషనల్ కరాటే యువతిలా యాక్షన్ సన్నివేశాల్లో అదరగొట్టింది. అభిరామి పాత్రను పవర్‌ఫుల్‌గా తీర్చిదిద్దారు. అయితే ఆమె పాత్రని ఓ సర్‌ప్రైజ్‌లా రివీల్ చేసుంటే ఇంకాస్త బాగుండేదనిపిస్తుంది. జాన్ కొకేన్, పవన్ తదితరుల విలనిజం ఫర్వాలేదనిపిస్తుంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com